J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 35 31.01.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## కేసులు - వ్యాపారాలు - ఇంటిపోరుతో

# ఏ-2 'రాజీ'నామా

పొమ్మనలేక పొగబెట్టిన వైఎస్సార్‌సీపీ కోటరీ.. చుట్టుముడుతున్న కేసులు.. అధినేత శీతకన్ను, అల్లుడి వ్యాపారాలపై కూటమి ప్రభుత్వం దృష్టి.. కరుణించని కేంద్ర పెద్దలు.. ఒక్కమాటలో చెప్పాలంటే నా అనే దిక్కులేదు.. పట్టించుకునే నాథుడు లేరు. ఇదంతా.. గత ఎన్నికల వరకు ఢిల్లీ నుంచి గల్లీ వరకు చక్రం తిప్పిన విజయసాయిరెడ్డి అలియాస్ అబద్ధాల రెడ్డి గురించే. ఆడిటర్ స్థాయి నుంచి మొదలుపెట్టి అవినీతిలో ఆమూలాగ్రం చదివేసి.. ఏపీలో ఏ-2 అంటే తన బ్రాండే అని ముద్రవేయించుకున్న ఈ మాయా సామ్రాజ్య రూపకర్త.. సూట్‌కేసు కంపెనీల సృష్టికర్త.. రాజకీయ తాంత్రికుడి అవతారమెత్తిన లెక్కల మాంత్రికుడు తన రాజకీయ జీవితానికి గుడ్‌బై చెప్పేశారు. దశాబ్దకాలంపాటు ట్విట్టర్‌లో నికృష్ఠ రాతలు, అవినీతి కథలు వల్లెవేసిన ఈ వివాదాలరెడ్డి తన రాజీనామా ప్రకటన సమయంలోనూ తనదైన శైలిలో అబద్ధాలకు రెక్కలు తొడిగారు. వెంకన్న సాక్షిగా అంటూ తన అసంబద్ధ వ్యాఖ్యలను మరోసారి వల్లెవేశారు. అబద్ధం చెప్పను.. ఆడిన మాట తప్పను.. పైసా కూడా అవినీతి చేయనూ అంటూనే.. తన ఊసరవెల్లి నైజాన్ని మీడియా సాక్షిగా మరోసారి చాటుకున్నారు.

## జగన్‌కి విజయసాయి గుడ్‌బై

అవినీతి.. అక్రమాలు.. అరాచకాలు.. అనైతిక సంబంధాలు.. అసంబద్ధ ఆరోపణలకు ఏపీలో కేరాఫ్ అడ్రస్‌గా ముద్రపడిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తన ఆటను అర్ధాంతరంగా ముగించారు. సొంత పార్టీలో అంతర్గత శత్రువులు.. కమ్ముకొస్తున్న కేసుల భయంతో చేసేదిలేక చివరికి చేతులెత్తేశారు. అంతులేని ఊహాగానాలు, లోలోన ఆవరించిన ఆందోళనల మధ్య రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజకీయ నాయకుడి అవతారం చాలించారు. తద్వారా తన పొలిటికల్ ఇన్నింగ్స్‌కి ఫుల్‌స్టాప్ పెట్టేశారు.

### రైతుకుటుంబం నుంచి వచ్చి..

నెల్లూరుజిల్లా తాళ్లపూడిలోని ఓ రైతు కుటుంబంలో జన్మించిన విజయసాయిరెడ్డి చెన్నైలో సీఏ చేసి అక్కడే వీఎస్ కన్సెల్టెన్సీని ప్రారంభించారు. ఇందులో వైఎస్ కుటుంబం కూడా ఓ క్లయింట్‌గా చేరడంతో రాజారెడ్డి లెక్కలు చూసే దగ్గర నుండి ఆ కుటుంబంతో ఆడిటర్‌గా మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ తరువాత అవి బాగా బలపడ్డాయి. ఈ క్రమంలో 2006లో రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో టీటీడీ బోర్డు సభ్యుడై ప్రజాజీవితాన్ని ప్రారంభించారు. అక్కడనుండి వివిధ స్థాయిల్లో

10లో

## వికసించని విద్య
గుణ'పాఠం' ఎప్పుడు?

12లో

## ఏపీపై బీజేపీ కన్ను
మనసులో మాట

8లో

## షార్‌లో హుషార్




'ఇస్రో' శతాస్త్రం (నూరవ అస్త్రం) నింగిలోకి రివ్వుమంటూ దూసుకుపోయింది. ఈ ఏడాదిన తొలిసారిగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన జీఎస్ఎల్‌వి-ఎఫ్15 రాకెట్ ఎన్‌విఎస్-02(నావిక్-02) ఉపగ్రహాన్ని అవలీలగా మోసుకుపోయి.. భూమికి 36వేల కిలోమీటర్ల ఎత్తులో నిర్ధేశించిన కక్ష్యలో దిగ్విజయంగా ప్రవేశపెట్టింది. శ్రీహరికోటలోని షార్ రెండవ ప్రయోగవేదికపై నుంచి ఈనెల 29వ తేదీ బుధవారం ఉదయం సరిగ్గా 6.23 గంటలకు ఈ ప్రయోగంలో మూడు దశలను కేవలం 19.12 నిమిషాల్లోనే శరవేగంగా చేరుకుని షార్ శాస్త్రవేత్తలకు విజయానందం కలిగించింది. ఇస్రో కొత్త ఛైర్మెన్‌గా డా.వి.నారాయణన్ బాధ్యతలు తీసుకున్నాక ఆయన సారధ్యంలో ఈ ప్రయోగం జరగడం కూడా ఇదే మొదటిసారి.

12లో









# కూటమి పాలనలోనే మత్స్యకారుల సంక్షేమం

## • సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత్స్యకారుల సంక్షేమానికి బాటలు వేస్తోందని, వారి అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం చేపడుతోందని మాజీమంత్రి, సర్వేపల్లి నియోజకవర్గం శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల వెంకటాచలం మండలంలోని తిక్కవరప్పాడు వద్ద సర్వేపల్లి రిజర్వాయరులోకి ఆయన చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీనోత్సవంలో భాగంగా ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద సర్వేపల్లి రిజర్వాయర్‌లోకి 5.62లక్షల చేపపిల్లలను వదిలామన్నారు. చేపపిల్లల కోసం 60 శాతం నిధులు ప్రభుత్వం సమకూరిస్తే, 40 శాతం మత్స్యకార సొసైటీ భరిస్తుందని ఆయన తెలిపారు. అనికేపల్లి, తిక్కవరప్పాడు, సర్వేపల్లితో పాటు 11 గ్రామాలకు చెందిన 500 మంది ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు చేపలవేట ద్వారా లబ్ధిచేకూరుతుందని, బోట్లు, వలలు, తదితర సామగ్రిని సబ్సిడీపై అందజేయనుందని తెలిపారు. అంతేకాక, 5 డీప్ సీ ఫిషింగ్ బోట్లను సర్వేపల్లి నియోజకవర్గానికి ప్రభుత్వం అందించనుందని ఆయన చెప్పారు. ఒక్కో బోటు విలువ రూ. 1.20 కోట్లు వరకు ఉంటుందని, పురుషులకు 40 శాతం, మహిళల పేరుతో అయితే 60 శాతం సబ్సిడీతో పడవలు అందజేస్తారని ఆయన చెప్తూ, ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


### సచివాలయాల తనిఖీకి శ్రీకారం :



సచివాలయాలను తనిఖీచేసి, వారి పనితీరును మెరుగుపరచేందుకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల శ్రీకారంచుట్టారు. మొదటగా వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆ సమయంలో ఉద్యోగుల్లో కొందరు మాత్రమే కార్యాలయంలో అందుబాటులో ఉండటం, అటెండెన్స్ రిజిస్టర్‌లోనూ ఏఎన్ఎం తప్ప మిగిలిన వారెవరూ సంతకాలు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సచివాలయ వ్యవస్థ వచ్చి ఐదేళ్లవుతుంటే, 11మంది ఉద్యోగులు ఉండి కూడా గిరిజనులకు కనీసం ఆధార్ కార్డులు ఎందుకు ఇప్పించలేకపోయారని ఆయన సిబ్బందిని ప్రశ్నించారు. ఆధార్ కార్డులు లేకపోవడంతో పేదలు అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఇస్కపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.

# కండలేరు ముంపు బాధితులను ఆదుకోండి

## - తెలుగుగంగ ఎస్ఇకి బీజేపీ నేత మిడతల వినతి -



జిల్లాలోని కండలేరు ముంపు బాధితులకు ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల వినతి ఇటీవల తెలుగు గంగ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాధాకృష్ణారెడ్డిని కలసి విజ్ఞప్తి చేశారు. జీవో నెంబర్ 98 ప్రకారం కండలేరు ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో 50శాతం ముంపు వాసులకు కేటాయించాలని, దానికి అనుబంధంగా జీవో నెంబర్ 68ని తీసుకువచ్చి ముంపువాసులకు త్వరితగతిన ఉద్యోగాలివ్వాలని ఆయన సూచించారు. మొదటి సీనియారిటీ జాబితా 2010 సంవత్సరంలో, రెండవ సీనియారిటీ జాబితా 2014 నాటి జాబితాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వారికి ఉద్యోగాలు కేటాయించాలని ఆదేశించినా, అధికారుల అవగాహన లోపం వల్ల ఆ జీఓలను పట్టించుకోకపోవడంతో, నేటికీ వాటిని ముంపువాసులకు కేటా యించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ నెంబర్ 98-68ల మేరకు కండలేరు నిర్వాసితులకు ఇకనైనా ఉద్యోగ వసతి కల్పించాలని, లేదా ప్రతి అవార్డుదారుడికి ఆర్అండ్ఆర్ యాక్ట్ ప్రకారం ఉపాధి కల్పించలేనప్పుడు పాతిక లక్షల రూపాయల వంతున బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు. నరాల సుబ్బారెడ్డి. ఏవి సుబ్బయ్య. నీలిశెట్టి లక్ష్మణరావు. మునిసురేష్, ముంపు నిర్వాసితులు పాల్గొన్నారు

# ఆకట్టుకుంటున్న రామాయణ ప్రవచనాలు



పద్యసారస్వత పరిషత్-నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీనగర్‌లోని శ్రీసీతారామస్వామి మందిరంలో ఎనిమిది రోజుల పాటు జరుగనున్న రామాయణ ప్రవచన కార్యక్రమాలు ఈనెల 24 తేది ప్రారంభమయ్యాయి. మందిరం పాలకవర్గ అధ్యక్షులు తన్నీరు మస్తాన్‌రావు ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. కోవూరు సమీపంలోని ఇనమడుగు గ్రామంలో ఉన్న శ్రీ సత్యానందాశ్రమం పీఠాధిపతులు శ్రీ శ్రీహరితీర్థస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొని అనుగ్రహభాషణం చేశారు. తొలిరోజున రామాయణం బాలకాండ పద్యానువాదకులు, వాల్మీకిరామాయణ పారాయణ ఆడియోకర్త..ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ తన ప్రవచనంలో ఆదికవి వాల్మీకిమహర్షి సంస్కృతభాషలో రచించిన శ్రీమద్రామాయణంలోని విశేషాలను వివరించారు. 'రాముడు-సుగుణాభిరాముడు' అనే అంశంపై ఆయన ఉపన్యసిస్తూ, శ్రీరామచంద్రుడు మహావిష్ణు అంశతో భువిలో అవతరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేశాడన్నారు. పితృవాక్పాలకునిగా, సకల సద్గుణశోభితునిగా, పరాక్రమవంతునిగా, ధర్మమూర్తిగా, దృఢవ్రతునిగా, సర్వభూతహితునిగా, సర్వసమర్థునిగా, ప్రియదర్శనునిగా, ఆత్మజ్ఞానిగా, తేజోవంతునిగా, ఆదర్శమానవునిగా రాముడు సకల మానవాళికీ ఆరాధ్యుడయ్యాడని వివరించారు. అనంతరం, అవధాని కోట రాజశేఖర్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సింహపురి ధార్మిక సంస్థ వ్యవస్థాపకులు ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, పద్యకళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, మురారిశెట్టి తిరుపతిస్వామి తదితరులు ముఖ్య అతిథులుగ పాల్గొన్నారు. పద్యసారస్వత పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, ప్రధానకార్యదర్శి డా.చీమకుర్తి వేంకటేశ్వరరావు, కోశాధికారి సూరం చంద్రశేఖరం, కార్యవర్గసభ్యులు భక్తిప్రపత్తులతో చేపట్టిన ఈ సభలు రాముని వైశిష్ట్యాన్ని, రామాయణ వైభవాన్ని చాటుతున్నాయి. ఈ ప్రవచనాలు భక్తాదులందరినీ బాగా ఆకట్టుకుంటున్నాయి కూడా.

# రెడ్‌క్రాస్‌లో గణతంత్ర వేడుకలు



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎస్ఆర్ స్పాస్టిక్స్ సెంటర్‌లో జనవరి 26న 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రెడ్‌క్రాస్ జిల్లాశాఖ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, స్పాస్టిక్ సెంటర్ అడ్వైజర్ మరియు మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్ పాల్గొని జాతీయ జండాను ఎగురవేశారు. అనంతరం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్యయోధుల త్యాగాలను, గణతంత్ర దినోత్సవం విశిష్టతను స్పాస్టిక్ సెంటర్ చిన్నారులకు వివరించారు. అనంతరం స్పాస్టిక్స్ చిన్నారులు భరతమాత, మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్, రాణీ రుద్రమదేవి వంటి మహనీయుల వేషధారణలతో అలరించారు. విశ్వమాత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దూబిశెట్టి కళ్యాణి మరియు వారి సభ్యులు జయశ్రీ, రాధ తదితరులు పాల్గొన్నారు. చుండూరి సుబ్రహ్మణ్యం సహకారంతో పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని, పండ్లను పంపిణీచేశారు. రెడ్‌క్రాస్ సెక్రెటరీ పి.మస్తానయ్య, స్పాస్టిక్స్ సెంటర్ ప్రిన్సిపల్ పి.గురునాధరావు, కో-కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు, రెడ్‌క్రాస్ ఏఆర్‌వి క్లినిక్ కన్వీనర్ బిరుదువోలు వెంకురెడ్డి, పినాకిని గాంధీ ఆశ్రమ కో-కన్వీనర్ ఎన్.రవీంద్రరెడ్డి, సుమంత్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



# చిన్నారులకు పోటీలు

రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా జనవరి 26న నెల్లూరులోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల చిన్నారులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ పోటీలు జరిగాయి. రోటరీ సభ్యులు శ్రీహరి, మాలికా బేగం, సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు రమణయ్య, నాగరాజ్, మోనికా, నాగేశ్వరమ్మ, భారతి పర్యవేక్షించారు.

## విద్యార్థులకు నగదు బహుమతులు

ఆత్మకూరు మండలం బట్టేపాడు జడ్పీ హైస్కూల్‌లో ప్రతిభతో రాణిస్తున్న విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వవిద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తుమ్మల వంశీవర్ధన్ ఈ నెల 27న 10వేల రూపాయలను ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు.

# నెరసం ఆధ్వర్యంలో..బాలికల దినోత్సవం



నెల్లూరుజిల్లా రచయితల సంఘం (నెరసం) ఆధ్వర్యంలో స్థానిక డీకేడబ్ల్యు జూనియర్ కళాశాలలో ఇటీవల జాతీయ బాలికల దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, ప్రముఖ న్యూరో ఫిజీషియన్ ఎ.హేమలతా రెడ్డి మాట్లాడుతూ బాలికలకు విద్య ఎంతో అవసరమన్నారు. బాగా చదువుకుని విద్యార్థినులు ఉన్నతస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా బాలికలు వ్యక్తిగత జీవితంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నెరసం ప్రధాన కార్యదర్శి పాతూరు అన్నపూర్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసులు, నెరసం కార్యవర్గసభ్యులు ఎస్.అరుణ, షేక్ నజ్మా బేగం, ఏ.భారతి, కళాశాల అధ్యాపకులు జి.కరుణకుమారి, పూర్ణసుధ పాల్గొన్నారు..

# వేడుకగా..సంగీత నృత్యోత్సవం



నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 76వ రిపబ్లిక్ డే సందర్భంగా ఇటీవల నెల్లూరు టౌనుహాలులో సుమారు 180 మంది కళాకారులతో సంగీత నృత్యోత్సవం ఘనంగా జరిగింది. యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్య నిర్వహణాధికారి ఎ.నాగేశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు మాట్లాడుతూ ఎందరో మహానుభావుల పోరాటం ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం లభించిందని, నాటి స్వాతంత్ర్యసమరయోధుల త్యాగనిరతిని స్మరించుకున్నారు. సంగీతం మనసుకు ఆహ్లాదం కలిగించడమే కాక, అనేకరకాల వ్యాధులను కూడా నయం చేస్తుందని అన్నారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ ఎమ్.డి. రఫీ అహ్మద్, స్థానిక ప్రముఖులు డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి, షేక్ షబ్బీర్, షేక్ రియాజ్‌బాషా, అందే శ్రీనివాసులు, ఎ.కె.రాయలు, తమ్మినేని పాండు, ఎ.జయప్రకాష్, డాక్టర్ కూరపాటి శ్యాంసన్, బి.కృష్ణ, రాచపాలెం రఘు, గంటా రవికుమార్, లింబో చిత్ర యూనిట్ ఎన్.సుధాకర్‌రెడ్డి, శైలజ, షేక్ ఇక్బాల్, షేక్ బాషాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లిపాడు గాంధీజీ ఆశ్రమాన్ని...

# మరో సబర్మతిగా తీర్చిదిద్దుతాం

**- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**



నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యే అయ్యాక తొలిసారిగా తమ నియోజకవర్గంలో ఉన్న పినాకిని సత్యాగ్రహాశ్రమాన్ని సందర్శించారు. జనవరి 30న మహాత్మాగాంధీ 77వ వర్ధంతి సందర్భంగా కోవూరు నియోజకవర్గం ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమంలో ఉన్న బాపూజీ విగ్రహానికి ఆమె పుష్పాంజలి ఘటించారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఎందరో దేశ భక్తులకు ఆశ్రయమిచ్చిన ఆ ఆశ్రమాన్ని చూసి ప్రశాంతమ్మ పులకించిపోయారు. అడుగడుగునా జాతిపిత బాపూజీ జ్ఞాపకాలతో ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల స్పర్శతో పులకితమైన పల్లిపాడు గాంధీ ఆశ్రమానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సాక్షాత్తూ గాంధీజీయే ఇక్కడికివచ్చి ఆశ్రమానికి ప్రారంభించడం, నాటి స్వాతంత్ర్యోద్యమానికి ఈ ఆశ్రమం కేంద్రం కావడం తెలిసిందే. మహాత్ముడి స్వహస్తాలతో ప్రారంభమైన పల్లిపాడు గాంధీ ఆశ్రమ ఘనచరిత్రను, నాటి స్వాతంత్ర్య స్ఫూర్తిని భావితరాలకు కూడా తెలియజేసేలా అభివృద్ధి చేస్తామని ఆమె తెలిపారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో జిల్లాలోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా.. జాతీయస్థాయిలో కూడా ఎందరో స్వాతంత్ర్య పోరాటయోధులకు స్వరాజ్యస్ఫూర్తిని రగిలించిన పల్లిపాడు గాంధీ ఆశ్రమాన్ని మరో సబర్మతి ఆశ్రమంగా తీర్చి దిద్దేందుకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలసి కృషి చేస్తామన్నారు. ఇప్పటికే పల్లిపాడు గ్రామాన్ని దత్తత తీసుకొని తన ఎంపీ నిధులతో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారని, గ్రామంలో రోడ్లు, డ్రైన్లు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించారని ఆమె గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా తాను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ ఆశ్రమ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తామన్నారు. తొలుత గాంధీ ఆశ్రమంలో విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, గాంధీ ఆశ్రమం కన్వీనర్ కల్పనమ్మ, గునపాటి ప్రసాద్‌రెడ్డి, రెడ్‌క్రాస్ డైరెక్టర్ యాలమూరి రంగయ్యనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్ర నాయుడు, టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల సంఘంలో

# మన నెల్లూరీయులు

- అధ్యక్షునిగా దొడ్ల మురళీకృష్ణారెడ్డి
- ఉపాధ్యక్షునిగా మన్నెం లక్ష్మీనాథరెడ్డి

ఆంధ్రప్రదేశ్ దేవాలయాల ధర్మసంస్థల వ్యవస్థాపక ధర్మకర్తల సంఘంలో అధ్యక్ష ఉపాధ్యక్ష పదవులకు మన నెల్లూరీయులు ఎన్నిక కావడం విశేషం. ఈనెల 26న ఎన్టీఆర్‌జిల్లా మైలవరంలో ఆ సంఘానికి ఎన్నికలు జరిగాయి. సింహాచలం శ్రీ వరాహ నరసింహస్వామి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు గౌరవాధ్యక్షులుగా ఎన్నికైన ఈ సంఘానికి, అధ్యక్షులుగా నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డి పాళెంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయం వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి ఎన్నిక కావడం విశేషం. అదేవిధంగా ముగ్గురు ఉపాధ్యక్షుల్లో ఒకరిగా నెల్లూరులోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం వ్యవస్థాపక ధర్మకర్త మన్నెం లక్ష్మీనాథరెడ్డి కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సంఘానికి ముఖ్య సలహాదారుగా ఎస్‌వి సుధాకర్‌రావు (శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం-ద్వారకా తిరుమల), కార్యనిర్వాహక అధ్యక్షులుగా డా. కోపల్లి హనుమంతరావు (ఆంధ్ర జాతీయ విద్యాపరిషత్-మచిలీపట్నం) ఎన్నికయ్యారు. డా. కామినేని పట్టాభిరామమయ్య (శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం-కైకలూరు), ఇనుగంటి వెంకటరోహిత్ (అన్నవరం దేవస్థానం)లు కూడా ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా వంకేశ్వరం ఆదినారాయణరావు (శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయం-పమిడిపాడు), జాయింట్ సెక్రటరీగా శ్రీనివాసరావు (శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం-విజయవాడ), కోశాధికారిగా కౌతా సుబ్బరావు (కౌతావారి సత్రం-విజయవాడ), ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పైడా ప్రసాద్ (పైడావారి సత్రం-కాకినాడ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# అదుపుతప్పుతున్న ఆట విడుపు!

*"పచ్చని పొలాలు.. కల్మషంలేని జనాలు ఉండే పల్లెటూళ్లు దేశానికి పట్టుకొమ్మలు" అన్న జాతిపిత మాటలు.. ప్రస్తుత ఆధునిక యుగంలో సవరించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అవును... నగరాలను తలదన్నేలా గ్రామాల్లోనూ జూదపు జాఢ్యం శరవేగంగా పాకుతోందంటే అతిశయోక్తి కాదేమో. కుటుంబాలని గుల్లచేస్తున్న ఆధునిక సంస్కృతి పట్టణాల నుండి పల్లెలకి వ్యాపిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది.*

*ఇటీవల గ్రామాలు వేదికలుగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సంక్రాంతి సంబరాలు, సంప్రదాయాలకు కొత్త అర్థం తీసుకొచ్చేలా కనిపించడమే ఇందుకు కారణం. అత్యంత జుగుప్సాకరమైన కార్యక్రమాలతో రాష్ట్రంలో సంక్రాంత్రి సంబరాలు నిర్వహించుకోవడం దిగజారుతున్న నైతిక విలువలకి తార్కాణం.*



- ఆంధ్రాలో పెడదారి పడుతున్న సంప్రదాయాలు
- వ్యాపారమయమైన సంక్రాంతి సంబరాలు
- ఆచారం పేరుతో అసాంఘిక కార్యకలాపాలు

### వ్యాపారంగా మారిన ఆచారం!

ఉమ్మడి గోదావరి జిల్లాలతో పాటు విశాఖ, కృష్ణా, గుంటూరుజిల్లాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఇందుకోసం ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కాసుల మూటలతో స్వగ్రామాలకు చేరుకోవడం.. కాయ్ రాజా కాయ్ అంటూ పోటీ పడడం ప్రతీ ఏటా జరుగుతున్న తంతే. పండుగల సందర్భంగా పల్లె జనమంతా ఒక చోటచేరి సరదాగా గడపడానికి, ఉల్లాసంగా ఉత్సాహంగా పండుగ సంబరాలని జరుపుకోవడానికి పురుడుపోసుకున్న క్రీడా వినోదం కోడి పందేలు. అదే సమయంలో బావా.. బావమర్దుల చిలిపి పోరాటాలతో, వంశాల పేరుతో గొప్పులు చెప్పుకునే జంబాలుగాళ్ళతో కోడి పందేలు సందడిగా ఉండేవి, చిన్నా, పెద్దా... ఆడా, మగా అన్న తేడాలేకుండా అందరినీ అలరించేవి. కొన్ని ప్రాంతాలలో కోడి పందాలతో పాటు వీధి నాటకాలు, భోగం మేళాలు.. మేజువాణీలు, రికార్డింగ్ డ్యాన్సులు సర్వసాధారణం. అలాంటి సరదా ఆచారం ఇప్పుడు కోట్ల వ్యాపారంగా అవతరించింది.

### నిర్భయంగా అసాంఘిక కార్యకలాపాలు

విచ్చలవిడిగా సాగుతున్న సంక్రాంతి సంబరాలు కొన్ని జిల్లాలలో హద్దులు దాటుతున్నాయి. ఆటవిడుపు పేరుతో జరిగే క్రీడా వినోదం అదుపుతప్పి అసాంఘిక కార్యకలాపాలకు ఆలవాలంగా మారుతోంది. మద్యం, మగువ, జూదం వంటివి రాజ్యమేలుతున్నాయి. మితిమీరిన శృంగార నృత్యాలతో సంబరాలు శృతి మించుతున్నాయి. అనధికార క్యాసినోలతో వర్ధిల్లుతున్నాయి. అధికార దురహంకారానికి సాక్షీభూతంగా పరిఢవిల్లుతున్నాయి.

### సవాళ్లు.. ప్రతిసవాళ్లు

ప్రశాంతతకు మారుపేరైన గోదావరిజిల్లాలలో సంక్రాంతి సంబరాల సమయంలో ఆ ఛాయలు మచ్చుకైనా కనిపించవు. మనం గోదావరి జిల్లాలలో ఉన్నామా..? అని అనుమానం కలిగే స్థాయిలో వారి భాష, ప్రవర్తన, నడవడికా మనకి దర్శనమిస్తాయి. సవాళ్ళు ప్రతిసవాళ్ళతో పరిసరాలు హోరెత్తుతుంటాయి. ఓవైపు పేకాట, మరోవైపు మద్యం. ఇంకోవైపు కోడి పందాలు, వీటన్నికీ తోడుగా అశ్లీల నృత్యాలు, భారీ సెట్టింగులతో వెలసిన క్యాసినో ప్రాంగణాలు. ఆ మూడురోజులూ ఇక్కడ. చట్టం పనిచేయదు. నిబంధనలు వర్తించవు. ఖాకీలకు కళ్ళు కనిపించవు, అధికారగణం అటువైపు కన్నెత్తి కూడా చూడరు. అంతేకాదు, మేము సైతం అంటూ పోలీసులు, అధికారులు ఈ వేడుకలలో అతి సామాన్యులలాగా పాల్గొనడం ఇక్కడ రివాజు. ఎప్పుడెప్పుడు సంక్రాంతి వస్తుందా.. అని వారంతా ఎదురు చూస్తుంటారు. అంతలా వాళ్ళకి మామూళ్లు అందుతాయి. వాళ్ళ గొంతెమ్మ కోరికలు క్షణాలలో తీరుతాయి. అందుకే వాళ్ళు ఆ మూడురోజులూ గుడ్డివాళ్ళైపోతారు, మౌన వ్రతం పాటించి మూగవారిగా మారిపోతారు. ఏపార్టీ అధికారంలో వున్నా, ఏ నాయకుడు రాజ్యం ఏలుతున్నా ఈ మూడురోజులూ ఈ జాతర జరగాల్సిందే. ఈ ఒక్క సమయంలో మాత్రం అధికార ప్రతిపక్ష నేతలంతా ఒక్కటై, ఏకతాటిపై నిలబడి నిర్భయంగా ఈ కార్యకలాపాల్ని ప్రోత్సహించి నిర్వహిస్తారు.

### కోట్లరూపాయలు చేతులు మారతాయి

చూడడానికి ఇదంతా చిన్న విషయంగా కనపడినా ఆర్థికలావాదేవీలలో మాత్రం చాలా పెద్ద మొత్తాలు చేతులు మారుతాయి. కోట్లరూపాయలలో పందేలు జరుగుతాయి. ఇదంతా ఏదో రహస్యంగా జరుగుతుందా అంటే.. అదీలేదు. అంతా బహిర్గతమే, బహిరంగమే. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వపక్షం, విపక్షం అంతా ఏకపక్షమై తామే సర్వాంతర్యామిగా అవతరించి ఏర్పాట్లు చేసుకుంటారు కాబట్టి.. ఇక 'ఇదేంటి' అని ప్రశ్నించే నాథుడేవుండడు.

సమాజం కొత్తపుంతలు తొక్కుతున్న ఆధునిక అంతర్జాల యుగంలో మేమేం తక్కువతిన్నాం అంటున్నారు మహిళలు. ఈ మూడురోజుల అనధికార జూద జాతరలో మహిళామణులు కూడా అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. మగవాళ్లకంటే మాకేం తక్కువ అన్నట్లుగా లక్షలలోనే పందాలుకాస్తున్నారు. మగవాళ్ళతో సరిసమానంగా మద్యం కూడా పుచ్చుకుంటున్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, ముంబై, కలకత్తా, కొత్తఢిల్లీ వంటి మహానగరాలనుండే కాకుండా విదేశాలనుండి కూడా ఈ సంక్రాంతి సంబరాలలో పాల్గొనడానికి జనం ఆసక్తి చూపుతున్నారు. ఫాల్స్ ప్రిస్టేజికి వెళ్తున్న పందెం రాయుళ్ళు అప్పులు చేసిమరీ ఈ సంబరంలో పాల్గొంటున్నారు. ఇల్లు, వళ్ళు గుల్ల చేసుకుంటున్నారు.

### ఏ ఏడాది కా ఏడాది కొత్త రూపం సంతరించుకుంటూ..

అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోటీపడుతూ ఈ సంబరాలు కూడా ఎప్పటికప్పుడు కొత్తరూపం సంతరించుకుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వస్తున్న ఆధునిక జూద పరికరాలు కూడా ఈ వేడుకలలో దర్శనమిస్తున్నాయి. సందర్శకులని ఆకట్టుకోవడం కోసం విదేశాల నుండి సైతం కొత్త పరికరాలని తెప్పిస్తున్నారంటే ఇక్కడ నిర్వాహకులకు ఏస్థాయిలో ఆదాయం ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర లేదు. కేవలం ఈ మూడురోజుల లోనే వాళ్ళు లక్షల్లో లాభం ఆర్జిస్తారని ఆ ప్రాంత వాసులు చెప్తున్నారు.

### ఆటవిడుపు అదుపు తప్పుతోంది..

అటవిడుపు కోసం మొదలైన సంప్రదాయం అదుపుతప్పింది. ఎప్పటికప్పుడు స్థాయి పెంచుకుంటూ, విచ్చలవిడితనానికి పెద్దపీట వేసుకుంటూ సాగుతోంది. ప్రభుత్వ పెద్దలు, అధికారగణం చెడు చూడం, చెడు మాట్లాడం, చెడు వినం... అన్నట్లుగా కళ్ళు, నోరు, చెవులు మూసుకోవడంతో అసలైన సంప్రదాయాలు అటకెక్కుతున్నాయి. అసాంఘిక దురాగతాలు తెరమీదికి వచ్చి అరాచకం సృష్టిస్తున్నాయి.

ఏదైవైనా సంక్రాంతి వేడుకల్లో తెలుగు సంప్రదాయాలు వక్రదారిని ఎంచుకుని.. గమ్యం తెలియని తీరానికి పయనిస్తున్నాయన్నది నిజం. చూద్దాం... ఈ విషసంస్కృతి చివరికి ఏ వికృతికి దారితీస్తుందో..!

లాయర్
జనవరి 31, 2025

# ఇస్రోకి శతకోటి 'వంద'నాలు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అంతరిక్షంలో అద్భుతాలు సృష్టిస్తోంది. భారత శాస్త్రవేత్తల అసామాన్య ప్రతిభా పాటవాలకు నిలువెత్తు ప్రతీకగా నిలుస్తూ, అంతరిక్ష రంగంలో భారత కీర్తిపతాకాన్ని రెపరెపలాడిస్తోంది. శ్రీహరికోట రాకెట్ ప్రయోగాలకు పేరెన్నికగన్న కోటగా ప్రపంచప్రఖ్యాతిని పొందుతోంది. జనవరి 29వ తేదీ బుధవారం నాడు శ్రీహరికోట షార్ సెంటర్ నుంచి ఇస్రో చేపట్టిన నూరవ రాకెట్ ప్రయోగం కూడా అద్వితీయమైన విజయం సాధించి, అంతరిక్ష రంగంలోనూ తిరుగులేని శక్తిగా భారత్ అవతరించింది. దీంతో, షార్‌లో అంతరిక్ష కేంద్రం ఏర్పడిన తర్వాత ఇప్పటి దాకా జరిగిన వంద రాకెట్ ప్రయోగాల్లో 90 ప్రయోగాలు దిగ్విజయమైనట్లయింది. ఇప్పటికే 4 ఎస్ఎల్‌వి రాకెట్లు, ఏఎస్ఎల్‌వి రాకెట్లు మరో 4, పిఎస్ఎల్‌విలు 62, జీఎస్ఎల్‌విలు 16తో పాటు మార్క్ 3-ఎల్‌వీఎం 3 రాకెట్లు 7, ఎస్ఎస్ఎల్‌విలు 3, ఆర్ఎల్‌వి టీడీ స్కా్రమ్‌జెట్ క్రూ ఎస్కేప్ సిస్టమ్ అనే మరో 3 రాకెట్ ప్రయోగాలు మొత్తం అన్నీ కలిపి 99 ప్రయోగాలు చేపట్టి ఉండగా, తాజాగా జీఎస్ఎల్‌వి-ఎఫ్ 15 రాకెట్ జయప్రదం కావడంతో మొత్తం వంద రాకెట్ ప్రయోగాలు నిర్వహించినట్లయింది. ఇస్రో కొత్తఛైర్మన్ నారాయణన్ సారధ్యంలో జరిగిన వందో రాకెట్ ప్రయోగం సక్సెస్ కావడంతో షార్‌లో హుషార్ హోరెత్తింది.

షార్‌లో అంతరిక్షకేంద్రం ఏర్పాటుకు 1969 ప్రాంతంలో శ్రీకారం చుట్టారు. చెన్నైకి 80 కిలోమీటర్లు, సూళ్ళూరుపేటకు 17 కిలోమీటర్ల దూరంలో సముద్రతీరంలో ఉన్న శ్రీహరికోట దీవి రాకెట్ కేంద్రానికి అనువుగా ఉంటుందని నిర్ధారించుకుని ప్రఖ్యాత శాస్త్రవేత్త విక్రమ్ సారాబాయి నేతృత్వంలో షార్‌లో అంతరిక్ష కేంద్ర నిర్మాణానికి అడుగులుపడ్డాయి. ఆయన చేతులమీదుగా సైకిళ్ళతో బుల్లిబుల్లి రాకెట్‌లను మోసుకెళ్ళి ప్రయోగాలు చేసుకునే స్థాయి నుంచి నేడు విశ్వవిఖ్యాత స్థాయిలో అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో తన సత్తా చాటుకుంటోంది. తొలినాళ్ళలో ఇతర దేశాల సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడిన స్థితి నుంచి కాలక్రమేణా తమకు తామే ప్రతిభతో ముందడుగులు వేస్తూ ఇతర దేశాలనే అబ్బురపరుస్తున్నారు మన శాస్త్రవేత్తలు. రాకెట్ ప్రయోగాలు ప్రారంభమయ్యాక, అప్పుడప్పుడూ అనుకోని పరాజయాలు ఎదురైనా శాస్త్రవేత్తలు వెనకడుగు వేయకుండా, మొక్కవోని దీక్షతో ఎదుగుతూ, ఓటమిల నుంచే విజయాలకు బాటలు వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆ సహనం, ఆ నిబద్ధత, ఆ ప్రజ్ఞాపాటవాలే మన శాస్త్రవేత్తల విజయపరంపరకు కారణమవుతున్నాయని అనుకోవచ్చు. 1980 ప్రాంతాల్లో విఖ్యాత అంతరిక్ష శాస్త్రవేత్త అబ్దుల్‌కలాం నేతృత్వంలో కూడా ఇక్కడ నుంచి రాకెట్ ప్రయోగాలు జరిగాయి. ఆ తర్వాత ఇస్రో రామబాణం లాంటి రాకెట్లను దేశీయ పరిజ్ఞానంతోనే తయారుచేసుకుంది. వాటిద్వారా మరెన్నో చరిత్రాత్మకమైన విజయాలు సాధిస్తూనే ఉంది. అంచలంచెలుగా రెండు ప్రయోగ వేదికలు కూడా ఏర్పాటుచేసుకుని చిన్నస్థాయి నుంచి భారీ, అతి భారీ రాకెట్ల ప్రయోగానికి కూడా సిద్ధమై ఆ ప్రయోగాల్లో మన శాస్త్రవేత్తలు విజయం సాధించారు. అంతేకాదు, మన దేశానికి సంబంధించిన ఉపగ్రహాలనే కాక, ఇప్పటికి ఇతర దేశాలకు చెందిన సుమారు 433 ఉపగ్రహాలను కూడా అంతరిక్ష కక్ష్యలోకి జయప్రదంగా పంపడం ఇస్రో అమోఘమైన ప్రతిభకు తార్కాణం. ఇటీవలి కాలంలోనే చంద్రయాన్ విజయం, ఆతర్వాత మంగళయాన్, ఆదిత్య ఎల్1 వంటి అపురూప ప్రయోగాలు కూడా షార్ నుంచే జరిగాయి. అత్యంత అధునాతనమైన స్పేడెక్స్ ఉపగ్రహాలతో డాకింగ్ టెక్నాలజీని కూడా అందుబాటులోకి తెచ్చుకుని ఇస్రో రాకెట్ ప్రయోగాల్లో రాకెట్ వేగంతో ముందుకు దూసుకుపోతోంది. ఎంతో బృహత్తరము, మహత్తరమైన ప్రయోగాలకు శ్రీహరికోట వేదికగా మారింది. ఖగోళ రహస్యాలు, భూమి పుట్టుక, పరిణామక్రమం, గ్రహాల గుట్టుమట్లు, చంద్రుడు-సూర్యుడుల స్థితిగతులు, సముద్రాల్లో రేగుతున్న కల్లోలాలు, రానున్న ప్రకృతి విపత్తులు అన్నిటినీ తెలుసుకునేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి అమేయం..నిరుపమానం!.. తాజాగా నావిగేషన్ ఉపగ్రహమైన జీఎస్ఎల్‌వి-ఎఫ్ 15 రాకెట్ ప్రయోగం కూడా విజయవంతం కావడంతో, భవిష్యత్తులో మరింత సామర్థ్యం కలిగిన రాకెట్‌లను నింగిలోకి ప్రయోగించాలని, అందుకు అనువుగా 3వ లాంచ్‌ప్యాడ్‌ను కూడా నిర్మించాలని శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఏదేమైనా, ఈ ప్రతిష్టాత్మక రాకెట్ ప్రయోగాల ద్వారా అపూర్వ విషయాలు శోధిస్తూ, అప్రతిహతమైన విజయాలు సాధిస్తూ, నింగిలోకి.. రేపటి భవిష్యత్తులోకి దూసుకుపోతున్న 'ఇస్రో' భారతీయులందరికీ గర్వకారణం. ఇస్రోకి శతకోటి 'వంద'నాలు!

# రెడ్‌క్రాస్‌ని భ్రష్టు పట్టిస్తున్నారు!

దేశవ్యాప్తంగా సేవాస్ఫూర్తితో పనిచేస్తున్న రెడ్‌క్రాస్, నెల్లూరుశాఖ మాత్రం ఆధిపత్య పోరుతో, కుళ్ళు రాజకీయాలతో భ్రష్టుపట్టిపోతోంది. రెడ్‌క్రాస్ అనుబంధ విభాగంగా క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పడ్డప్పటి నుండి రెడ్‌క్రాస్ రాజకీయాలకి వేదికగా మారిందన్నది నా ఉద్దేశం. అంతకుముందు డాక్టర్ అన్నదాత వెంకట సుబ్రహ్మణ్యం(ఏవీఎస్) లాంటి వ్యక్తులు ఉన్నప్పుడు రెడ్‌క్రాస్ పేరు కేవలం సేవా కార్యక్రమాల సందర్భంలోనే వినపడేది. రెడ్‌క్రాస్ చేసే కార్యక్రమాలకి చేయూతనందించడానికి మనసున్న దాతలు కూడా చాలామంది ముందుకు వచ్చేవారు. క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పడిన కొన్నాళ్ళకి రెడ్‌క్రాస్‌ని సేవాసంస్థకి అనడంకన్నా స్వాహా సంస్థ అనేవాళ్ళ శాతం పెరిగిపోయింది. కేవలం క్యాన్సర్ ఆసుపత్రిలో జరుగుతున్న ఆర్థిక దోపిడీ కారణంగా ఆ మచ్చ రెడ్‌క్రాస్‌పై పడింది. చంద్రశేఖరరెడ్డి ఛైర్మన్ అయ్యాక రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాల సంఖ్య పెరిగింది. కానీ, రెడ్‌క్రాస్‌ని అడ్డంపెట్టుకుని అక్రమంగా దోచేసుకున్న వారిపై ఆయన ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయాడు. ఇప్పుడు కొత్తగా ఛైర్మన్ బాధ్యతలు చేపట్టిన వాకాటి విజయకుమార్‌రెడ్డయినా స్వాహారాయుళ్ళ కొమ్ము కాయకుండా రెడ్‌క్రాస్‌ని సేవా కార్యక్రమాలకి వేదికగా మారుస్తాడని ఆశిద్దాం! ఏదేమైనా రెడ్‌క్రాస్ వంటి సేవాసంస్థకి కూడా అవినీతి, అక్రమాలు, రాజకీయాలు వంటి మలినాలని అంటించడం మన నెల్లూరు మేతా(ధా)వులకే చెల్లింది. – పి.రాధాకృష్ణారెడ్డి, రిటైర్డ్ హెడ్మాస్టర్, బాలాజీనగర్, నెల్లూరు.

# చినబాబుపై విశ్లేషణ బాగుంది!

కూటమిలో కలకలం రేపిన 'చినబాబుని ఉపముఖ్యమంత్రి చేయాలన్న డిమాండ్' అంశంపై గత వారం మన 'లాయర్' "చినబాబు భజన" పేరుతో రాసిన విశ్లేషణ బాగుంది. మీరు రాసినట్లుగా హనీమూన్ కూడా కాకముందే విడాకుల కోసం తాపత్రయపడ్డం మూర్ఖత్వం. రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెట్టాలంటే ఈ ఐదేళ్ళు కూటమి బంధం పటిష్టంగా ఉండాలి. కేంద్రం సహకారం ఉంటేనే అనాధ రాష్ట్రంగా అవతరించిన ఆంధ్రాకి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఇప్పుడు అనవసరంగా గొడవలు పడి బంధం బద్దలు చేసుకుంటే అధికారం మళ్ళీ జగన్ పాలై రాష్ట్రం అంధకారంలోకి వెళ్ళిపోతుంది. తస్మాత్ జాగ్రత్త...!

ఆర్.వి.రమణయ్య - కావలి.




lawyerpatrika@gmail.com
+91 98663 14741

# షార్‌లో 3వ లాంచ్‌ప్యాడ్ అభినందదాయకం!

వారం వారం ఆసక్తికర అంశాలతో అలరిస్తున్న మన 'లాయర్'కి నా అభినందనలు. గత వారం వచ్చిన వార్తలని గమనిస్తే... ఇస్రో గగన్‌యాన్ చేపట్టడం దేశానికి కీర్తి దాయకం. ప్రభుత్వం 3వ లాంచ్‌ప్యాడ్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం అభినందదాయకం, ప్రోత్సాహకరం. ఇక మహిళలలో క్యాన్సర్ విషయానికి వస్తే యుటిరిన్ క్యాన్సర్ వాక్సినేషన్ విస్తారంగా చేపట్టాలి. నేషనల్ డిజిటల్ హెల్త్‌మిషన్ ద్వారా ఏఐ ఆధారిత హెల్త్ ప్రొఫైల్ మెయింటెయిన్ చేయాలి. 40సంవత్సరాలు దాటిన మహిళలకి తరచూ స్క్రీనింగ్ మిషన్ మోడ్‌లో క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలి.

సి.ఆర్.విశ్వేశ్వరరావు
మాజీ ఉపకులపతి, హైదరాబాదు.




## సుందర ప్రదేశాలు జాస్తి... కనీస సౌకర్యాలు నాస్తి

# ఆకట్టుకోలేకపోతున్న పర్యాటక రంగం!

దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే రంగాల్లో అతి కీలకమైన వాటిలో 'పర్యాటక రంగం' కూడా ఒకటి. ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, ప్రాచీన చరిత్ర వగైరాలతో కలసి మొత్తంగా మన దేశపు ఘనమైన, వైవిధ్యభరితమైన సాంస్కృతిక వారసత్వ సంపద గొప్పతనాన్ని చాటేది పర్యాటక రంగమే. అయితే, వినోదానికి.. విజ్ఞానానికి, వికాసానికి..జాతి ఐక్యతకు దోహదం చేసే పర్యాటక రంగం మన దేశంలో నానాటికీ నీరసపడిపోతుండడం విచారకరం.

అత్యంత అద్భుతమైన..సహజసిద్ధమైన పర్యాటక ప్రాంతాలకు, రమణీయమైన చారిత్రక స్థలాలకు మనదేశంలో కొదవలేదు. పురాతన కాలం నుంచీ ఎన్నో రకాలైన పర్యాటక ప్రదేశాలు మన దేశంలో కొల్లలుగా ఉన్నాయి. జీవితంలో ఒక్కసారైనా చూడాలనిపించే హిమాలయాలు, మానససరోవరం వంటి ప్రాంతాలు, ఆగ్రా-ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, జైపూర్, జైసల్మేర్, జమ్ముకశ్మీర్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర వంటి విఖ్యాత పర్యాటక నగరాలు, ప్రపంచఖ్యాతి చెందిన తాజ్‌మహల్ అందాలు, అజంతా-ఎల్లోరా, ఖజురహో సోయగాలు, హంపీ, మహాబలిపురం, ఊటీ-కొడైకెనాల్ ఇలా చెప్పుకుంటూపోతే కనువిందుచేసే పర్యాటక స్థలాల జాబితా కొండవీటి చాంతాడంత అవుతుంది. అంతేకాదు, దేశవ్యాప్తంగా 7516 కిలోమీటర్ల పొడవున్న సముద్రతీరప్రాంతం, అక్కడక్కడా ఆహ్లాదకరమైన బీచ్‌లు మనకు సొంతం. గోవా, కేరళ, తమిళనాడు బీచ్‌లు, అండమాన్-నికోబార్, లక్షదీవులు వేటికవే ప్రత్యేకత. అంతెందుకు, ఒక్క ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే అద్వితీయమైన శిల్పకళతో వెలసిన కోటలెన్నో ఉన్నాయి. గోల్కొండ కోట, చంద్రగిరి కోట, గండికోట, ఇంకా.. నాగార్జునకొండ, రుషికొండ, ఉదయగిరి దుర్గంతో పాటు బెలుం గుహలు, బొర్రా కేవ్స్, అరకులోయ, లంబసింగి, హార్స్‌లీ హిల్స్, తలకోన, పెంచలకోన జలపాతాలు, సహజసిద్ధమైన సరస్సులుగా పేరొందిన కొల్లేరు, పులికాట్ సరస్సులు, పక్షుల కిలకిలా రావాలతో నేలపట్టు.. ఇలా ఎన్నో ప్రాంతాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంటాయి. అయితే, వాటినింకా బాగా అభివృద్ధి చేసుకుంటే స్థానికుల ఉపాధికి కూడా దిగులుండదు. మనకున్న పర్యాటక స్థలాలను సమర్థవంతంగా అభివృద్ధిచేసి ప్రచారం చేసుకుంటే చాలు.. దేశవిదేశాల నుంచి పర్యాటకులు ఆయా ప్రాంతాలకు పెద్దసంఖ్యలో క్యూకడతారు. తద్వారా ఆర్థిక వనరులు చేకూరి, అనేక ఉద్యోగావకాశాలు, అనుబంధ వ్యవస్థలు కూడా తోడై, జాతీయ ఆర్థికవృద్ధికి, దేశ పురోభివృద్ధికి మార్గం సుగమం అవుతుంది. కానీ, ఆయాప్రాంతాలకు రోడ్లు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు కరువవడం, ముఖ్యంగా భద్రతకు భరోసా లేకపోవడం వంటి లోపాలతో దేశంలోని అనేక చారిత్రక, పర్యాటక ప్రాంతాలు క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వీటిపై ప్రభుత్వాలు తగు శ్రద్ధ చూపకపోవడం, వాటి బాగుకు నిధులు కేటాయించకపోతుండడంతో అవి అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉంటున్నాయి.

## పెరుగుతున్న పర్యాటకులు.. చాలీచాలని వసతులు

వాస్తవానికి మనదేశంలో తరచూ యాత్రలు చేసేవారు, పర్యాటక ప్రాంతాలను సందర్శించాలనే ఆసక్తి ఉన్నవారి సంఖ్య ఏడాదికేడాది బాగా పెరిగిపోతోంది. అధిక శాతం మన దేశ పౌరులే కొత్త కొత్త ప్రాంతాలను సందర్శించడం అలవాటుగా మార్చుకుంటున్నారు. హిమాలయాలను సందర్శించడం, మానససరోవరాన్ని చూడగలగడం జీవితంలో ఒక గొప్ప అనుభూతిగా పర్యాటకులు భావిస్తుంటారు. ఎప్పుడు వీలుదొరికితే అప్పుడు ఆ ప్రాంతాలను చుట్టి రావడం మహద్భాగ్యంగా భావిస్తుంటారు కూడా. అయితే ఆయా ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన వసతులు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ప్రభుత్వాలు వాటిని పట్టించుకోకపోవడంతో అపురూపమైన ఆ వారసత్వ సంపద క్రమేణా కనుమరుగైపోతోంది.

## అభివృద్ధిలో వేగం ఇంకా పెరగాలి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక భారత పర్యాటకానికి సంబంధించిన ప్రణాళికలు చురుగ్గా ప్రారంభమయ్యాయి. తొలినాళ్ళ పంచవర్ష ప్రణాళికల్లోనూ పర్యాటకానికి పెద్దపీట వేశారు. నాటి నుంచి ఎన్నో ఏళ్ళుగా ఒక్కొక్క అడుగు వేస్తూ పర్యాటక రంగంలో కుదురుకుంటున్న మనదేశం అనేక సమస్యల సవాళ్ళను అధిగమిస్తూ వస్తోంది. కేంద్రప్రభుత్వ సారధ్యంలో గత కొంతకాలంగా ప్రత్యేక పథకాలు అమలులోకి రావడంతో పర్యాటకాభివృద్ధికి మేలుబాటలు పడుతుండడంతో, గతంలో కన్నా ఇప్పుడు ఈ రంగం ప్రగతిమార్గంలో పయనిస్తుండడం వాస్తవమే అయినా, అనేక దేశాలతో పోలిస్తే మనం ఇంకా పర్యాటక అభివృద్ధిలో వెనకబడి ఉన్నామనే చెప్పాలి. స్థానికంగా ఉండే యువతను, ప్రజలను కూడా భాగస్వాములను చేసి, ఎక్కడికక్కడ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చేయూతనిస్తే పర్యాటకులకు, పర్యాటకరంగానికి కూడా ఉపయోగంగా ఉంటుంది. అదేవిధంగా, అనాదిగా ఉన్న ఏ కొన్ని ప్రసిద్ధమైన ప్రాంతాల్లో మాత్రమే కాక, దేశవ్యాప్తంగా ఉన్న అనేక అపురూపమైన పర్యాటక ప్రాంతాలను గుర్తించి, వాటిని కూడా అందంగా, ఆకర్షణీయంగా, సౌకర్యయుతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగు శ్రద్ధ తీసుకోవాల్సివుంది. అప్పుడే పర్యాటకరంగంలో సమగ్రమైన పురోగతి వేగం పుంజుకుంటుంది. తద్వారా 'వికసిత్ భారత్-2047' స్వప్నం కూడా సాకారమవుతుంది. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశలో చర్యలు తీసుకుంటాయని, తద్వారా ప్రపంచంలోనే 'టాప్ టూరిజమ్ హబ్'గా భారత్‌ను అగ్రస్థానంలో నిలుపుతాయని ఆశిద్దాం!...

- రాజశ్రీ

# శ్రీసిటీలో.. 'ఎన్ఎక్స్ లాజిస్టిక్స్' విస్తరణ



జపాన్‌కి చెందిన నిప్పాన్ ఎక్స్‌ప్రెస్ కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఎన్ఎక్స్ లాజిస్టిక్స్ ఇండియా, శ్రీసిటీలో అధునాతన లాజిస్టిక్స్ సదుపాయాన్ని సోమవారం విస్తరించింది. ఈ సందర్భంగా శ్రీసిటీకి వచ్చిన చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మునేయో తకాహాషి, నిప్పాన్ ఎక్స్‌ప్రెస్ హోల్డింగ్స్ చీఫ్‌మేనేజింగ్ ఆఫీసర్ పురో తడా హీరోలకు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విస్తరణ ఎన్ఎక్స్ లాజిస్టిక్స్ ఇండియా మరింత నాణ్యమైన లాజిస్టిక్స్ సేవలను అందించడానికి దోహదపడుతుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# డాక్టర్ చెరియన్ మృతి విచారకరం

## శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి సంతాపం



దేశంలో మొట్టమొదటి విజయవంతమైన కొరోనరీ ఆర్టరీ బైపాస్, గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసిన ప్రముఖ హృద్రోగ వైద్యనిపుణులు కెఎం చెరియన్ మృతి పట్ల శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈనెల 27న ఒక ప్రకటనలో తన సంతాపం వ్యక్తం చేశారు. డాక్టర్ చెరియన్ సేవాతత్వం, అంకితభావం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. చెరియన్ మార్గదర్శకత్వంలో ఏర్పాటైన శ్రీసిటీ హెల్త్ సెంటర్ ఈ ప్రాంతంలోని పేదలకు నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. చెరియన్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# 'శ్రీ త్యాగరాజ సంగీత వైభవం'

నెల్లూరులోని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక వర్ధమాన సమాజం హాల్‌లో జరిగిన 'శ్రీ త్యాగరాజ సంగీత వైభవం' కార్యక్రమం శ్రోతలను అలరించింది. ప్రముఖ గాయని కుమారి మల్లాది అనూష తన మధురమైన గాత్రంతో త్యాగరాజ కీర్తనలను ఆలపించి అందరి ప్రశంసలు అందుకున్నారు. కీ బోర్డ్ పై సురభి సంగీత సౌరభ్, మృదంగంపై ఆర్.ఎం.ఈశ్వరపాయ్ వాద్య సహకారం అందించారు. అనంతరం వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా ఇమామి ఆగ్రోటెక్ (కృష్ణపట్నం) వైస్ ప్రెసిడెంట్ ఎం.వి. నారాయణమూర్తి, పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామ చంద్రప్రసాద్, చేతన కార్యదర్శి వై.శేషగిరీశం, వి.ఆర్.కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ కో-ఆర్డినేటర్ ఎన్.బలరామయ్య నాయుడు, నెల్లూరు వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.జయప్రకాష్, కవయిత్రి జి.సుభద్రాదేవి, విశ్వనాథం, రాచపాళెం రఘు పాల్గొన్నారు.

# తండ్రికి తగ్గ తనయుడు లోకేష్!



## ప్రశంసించిన వేమిరెడ్డి దంపతులు

యువనేత, మంత్రి నారా లోకేష్‌బాబు తండ్రికి తగ్గ తనయుడని, కార్యసాధకుడని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశంసించారు.

'యువగళం' పాదయాత్ర తలపెట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వారు ఇటీవల విడుదల చేసిన ప్రకటనలో మంత్రి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గూగుల్, టిసిఎస్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్ లాంటి దిగ్గజ పారిశ్రామిక సంస్థలు మన రాష్ట్రంలో 6.33 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేలా ఒప్పించి లోకేష్‌బాబు తన ప్రతిభను చాటుకున్నాడన్నారు. ఇటు కుప్పం నుంచి అటు విశాఖపట్నం వరకు సాగిన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా లోకేష్ పరిణితి చెందిన నాయకులుగా రాటుతేలారని కొనియాడారు.

రాష్ట్రంలోని 97 నియోజకవర్గాలను కవర్ చేస్తూ లోకేష్ పాదయాత్ర సాగితే అందులో 90 శాసనసభ స్థానాలు అభ్యర్థులు గెలిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు దోహదపడిందన్నారు. ఓవైపు మండుటెండలు మరోవైపు జోరు వర్షాలు లాంటి ప్రతికూల పరిస్థితులను కూడా నిబ్బరంగా ఎదుర్కొని అనుకున్న లక్ష్యాన్ని సాధించిన కార్యదీక్షాదక్షుడని లోకేష్‌ను వారు అభినందించారు. అడుగడుగునా ఆంక్షలు, అరెస్టులు లాంటి నిర్బంధాలను సైతం ఎదుర్కొని 226 రోజులలో 3,132 కిలోమీటర్లు కాలినడకన 2 వేల 97 గ్రామాల ప్రజల కష్టనష్టాలు వింటూ సాగిన యువగళం పాదయాత్రను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ ప్రక్షాళన యాత్రగా అభివర్ణించారు. తమ తండ్రి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో నడుస్తూ... ప్రస్తుతం విద్య, మరియు ఐటి శాఖ మంత్రిగా ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి కోసం లోకేష్ నిరంతరం కృషిచేస్తుండడం ఆయన పాలనాదక్షతకు నిదర్శనమని వారు పేర్కొన్నారు.

## ఉప్పొంగిన దేశభక్తితో..

# ఘనంగా గణతంత్ర వేడుకలు

***మువ్వన్నెల జెండా రెపరెపలతో, ఉప్పొంగిన దేశభక్తితో జిల్లావ్యాప్తంగా వాడవాడలా జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యాలయాలు, ప్రభుత్వకార్యాలయాల్లో జెండా వందనం చేసి, దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించిన స్వాతంత్ర్యయోధులను స్మరించుకున్నారు. ఆనందోత్సాహాలతో ప్రజలు జెండా పండుగ జరుపుకున్నారు. 'వికసిత్ భారత్' లక్ష్యసాధనలో భాగంగా, స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళికలోని పది సూత్రాల అమలుకు అకుంఠిత దీక్షతో అందరం కలసి పనిచేద్దామంటూ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ ప్రజలకు పిలుపునిచ్చారు.***

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరు పోలీసు కవాతు మైదానంలో ఈనెల 26న జరిగిన వేడుకల్లో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మువ్వన్నెల రంగుల బెలూన్లను, శాంతి కపోతాలను గాలిలోకి ఎగురవేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర విజన్‌లోని పేదరిక నిర్మూలన, ఉపాధి, నిపుణులైన మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, గ్లోబల్ బెస్ట్ లాజిస్టిక్స్, ఇంధన ఆదా, ఉత్పత్తి పరిపూర్ణత, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్నాలజీల లక్ష్య సాధనను గుర్తుచేశారు. జిల్లాలోని వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వివరిస్తూ పీఎం కిసాన్ పథకం క్రింద అర్హులైన 1,67,240 మంది రైతు కుటుంబాలకు 6 వేల రూపాయలు చొప్పున 66.75 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. అదేవిధంగా 561 రైతు సేవ కేంద్రాల ద్వారా 19,210 నాణ్యమైన వరి, వేరుశనగ, పెసర, మినుము విత్తనాలను సుమారు 6 కోట్ల 78 లక్షల రూపాయల సబ్సిడీతో 24,800 మంది రైతులకు అందించామన్నారు. 424 వ్యవసాయ ఫీడర్ల ద్వారా 2లక్షల నాలుగు వేల మంది వ్యవసాయ వినియోగదారులకు పగటిపూట తొమ్మిది గంటల ఉచిత విద్యుత్తు సరఫరాకు సబ్సిడీ కింద 397.62 కోట్ల రూపాయలను చెల్లించామన్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న లక్షా 72వేల మంది విద్యార్థులకు 45 కోట్ల 40 లక్షల రూపాయలతో 8 రకాల వస్తువులను కిట్స్ రూపంలో విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం కింద లక్షా 52వేల మంది విద్యార్థులకు 34 కోట్ల 54 లక్షల రూపాయల వ్యయంతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని వివరించారు ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనాన్ని ఈనెల 4వ తేదీ నుండి అమలు చేశామన్నారు. భూముల రీ-సర్వేను తిరిగి ప్రారంభిస్తున్నామని, పైలెట్ ప్రాజెక్టు కింద ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపికచేసి మొత్తం 35 గ్రామాలలోని 85,479 ఎకరాల 9 సెంట్లు రీ-సర్వే చేస్తున్నామన్నారు. అదేవిధంగా, కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు మొదటి వంద రోజుల్లో 5150 గృహాలు పూర్తిచేయడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను నెలకు 4000 రూపాయల చొప్పున ప్రతినెల 3,09,273 మందికి 132.15 కోట్ల రూపాయలను అందిస్తున్నామన్నారు. అదేవిధంగా 15వ ఫైనాన్స్ నిధులు 78.59కోట్ల రూపాయలను గ్రామపంచాయితీలకు జమ చేయడం జరిగిందని తెలిపారు. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో 6.20 కోట్లతో డివైడర్ల నిర్మాణం, నగర సుందరీకరణ పనులు జరుగుతున్నాయన్నారు జల జీవన్ మిషన్ కింద 200 పనులను 57.82 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్నామని విశదీకరించారు. ఈ వేడుకల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తదితరులు పాల్గొన్నారు.





## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. 'పాడుదమా స్వేచ్ఛా గీతం, ఎగరేయుదమా జాతీయ పతాకం'.. అంటూ కోవూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ చేసిన నృత్య రూపకం, జాతీయ నాయకుల వేషధారణలు, వందేమాతరం గీతాలాపన, 'హం ఇండియా వాలే' అంటూ విద్యార్థులు చేసిన నృత్యాలు, జాతీయ పతాక ప్రదర్శనలు అందరి కరతాళధ్వనులందుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ సాగిన వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇందులో ఐసిడిఎస్, డిఆర్‌డిఏ, పశుసంవర్ధక శాఖల శకటాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులందుకున్నాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందిస్తున్న అధికారులు, సిబ్బందికి, వివిధ రంగాల్లో ప్రతిభతో రాణిస్తున్న కళాకారులకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందజేశారు.



### విశ్వసాయిలో...

## వేడుకగా జెండా పండుగ



గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న నెల్లూరు అన్నమయ్య సర్కిల్ క్యాంపస్‌లో ఉన్న విశ్వసాయి జూనియర్ కాలేజీలో డైరెక్టర్లు డాక్టర్ ఎన్ సత్యనారాయణ, జి.కృష్ణమోహన్‌లు జెండా పండుగ ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించిపెట్టిన మహాత్మాగాంధీని, స్వాతంత్ర్యయోధుల త్యాగాలను వారు వివరించారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన డా.బిఆర్ అంబేడ్కర్ సేవలను స్మరించుకున్నారు. అనంతరం, విద్యార్థులు దేశభక్తి గీతాలతో సంబరాలు జరుపుకున్నారు. కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## వాకాటి ప్రమాణస్వీకారం



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ నూతన ఛైర్మెన్‌గా వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా చామర్తి జనార్ధన్‌రాజు ఈనెల 24న నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సభ్యుల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు.

## కమనీయం..శ్రీనివాస కల్యాణం!





నెల్లూరులోని సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో, స్థానిక వేదాయపాళెంలోని శ్రీ వేదగణపతి దేవాలయం కూడలి వద్ద ఇటీవల కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. వేదమంత్రాలు, మంగళవాద్యాల మధ్య, తిరుమల వేదపండితులు విష్ణుశర్మ ఆధ్వర్యంలో ఎంతో భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగిన ఈ కల్యాణవేడుకలో భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారిని-అమ్మవార్లను దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా వేదగణపతి కూడలి ప్రాంతమంతా భక్తజన సందోహంతో క్రిక్కిరిసిపోయింది. గోవింద నామోచ్ఛరణలతో వేదిక ప్రాంగణం మార్మోగింది. అనంతరం, అనేకరకాల సుగంధభరిత పుష్పాలతో శ్రీవారి పుష్పయాగ మహోత్సవాన్ని వేదపండితులు నేత్రపర్వంగా నిర్వహించారు. ప్రముఖ భక్తిసంగీత గాయని శ్రీవత్సల గానం చేసిన భక్తి పాటలు-సంకీర్తనలు, ప్రముఖ నృత్యకళాకారిణి వైష్ణవి బృందంలోని చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పుష్పయాగ మహోత్సవం తర్వాత కమిటీ నిర్వాహకులు భక్తులందరికీ శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# నెల్లూరు కబుర్లు

### పేదలకు మంచివైద్యం కోసమే..

## 'నారా లోకేష్ ఆరోగ్య రక్ష'

### రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



రాష్ట్రంలోని పేద, నిరుపేద కుటుంబాల్లోని రోగులకు, బాధితులకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలందించడం కోసమే 'నారా లోకేష్ ఆరోగ్య రక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 28న ఆయన నెల్లూరులోని 32, 33 డివిజన్లలో ఆమేరకు నిర్వహించిన ఆరోగ్యరక్ష వైద్య శిబిరాలను సందర్శించి రోగులను పరామర్శించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వర్తించని వారికి, దాతల సహకారంతో ఉచితంగా వైద్యం చేయిస్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. అందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్న మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో గణతంత్ర దినోత్సవం



నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో జనవరి 26న ఆదివారం నాడు 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి జాయింట్ కలెక్టర్ కార్తీక్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వంద అడుగుల స్తూపం వద్ద మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. వారందరికీ జాయింట్ కలెక్టర్ స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఉదయభాస్కర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్‌కుమార్ తదితర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



## జడ్పీ కార్యాలయంలో...

నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జనవరి 26న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆధ్వర్యంలో జడ్పీ సీఇఓ విద్యారమ, డెప్యూటీ సీఇఓ మోహన్‌రావులతో కలసి 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆనం అరుణమ్మ అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి ఒక క్రమబద్ధమైన, అర్థవంతమైన రాజ్యాంగాన్ని రూపొందించి అమలు చేయడంలో డా.బిఆర్ అంబేడ్కర్ చేసిన అపారమైన కృషి శ్లాఘనీయమైనదన్నారు. మన రాజ్యాంగం భారతీయులందరికీ ఒక పవిత్ర గ్రంథమన్నారు. ఈ వేడుకల్లో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### డా.కిషోర్స్ రత్నంలో..

## మార్మోగిన 'వందేమాతరం'



రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26న నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం రేస్ ఇంటర్నేషనల్, రోషిణి రత్నం జేఇఇ, కె25 అండ్ మెడికల్ ఒలింపియాడ్ , టెక్నోస్కూల్ ఆధ్వర్యంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సంబరంగా జరిగాయి. జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు జాతీయజెండాను ఎగురవేసి, విద్యార్థులతో జెండా వందనం చేయించారు. తొలుత విద్యార్థులు చేసిన మార్చ్‌ఫాస్ట్ అందరినీ ఆకట్టుకుంది. అనంతరం, విద్యార్థుల 'వందేమాతరం' గీతాలాపనతో విద్యాసంస్థల ప్రాంగణం మార్మోగింది. 'దేశం మనదే'నంటూ పలు దేశభక్తి గీతాలకు విద్యార్థులు నృత్యాలు చేశారు. డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు పాల్గొని విద్యార్థులకు, తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నాటి స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. విద్యాసంస్థల జూనియర్ మేనేజర్ అజయ్‌కుమార్‌సింగ్, ఏఓ సునీల్, ప్రిన్సిపాల్స్ మణిమాల, ప్రపూర్ణ, జాస్మిన్, నాగేంద్ర, కోఆర్డినేటర్ సమీర పాల్గొన్నారు.

## ప్రజలకు వ్యతిరేకంగా.. ప్రభుత్వాల పాలన

- దుయ్యబట్టిన మహిళాసంఘం నేత రమాదేవి




ప్రజలకు వ్యతిరేకంగా నేడు ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని, పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెట్టేవిధంగా ప్రభుత్వాలు వ్యవహరించడం దారుణమని అఖిల భారత మహిళాసంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి దుయ్యబట్టారు. నెల్లూరులో ఫిబ్రవరి1 నుంచి జరుగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని, ఈనెల 28న సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన సింహపురి సాంస్కృతిక ఉత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య వారసులుగా ఎంతో ఉత్తేజం పొందిన సీపీఎం నాయకులు, కార్యకర్తలు ప్రజల కోసం పోరాటాలు చేస్తున్నారని, ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం ఉద్యమాలు చేపడుతూనే ఉన్నారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమానికి రెహనాబేగం అధ్యక్షత వహించగా, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

## భిన్నత్వంలో ఏకత్వం మన నినాదం



జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరు ఇందిరా భవన్‌లో జిల్లా కాంగ్రెస్‌పార్టీ (డీసీసీ) అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలు నిర్వహించారు. ఏడు దశాబ్దాల క్రితం ఇదే రోజు మన రాజ్యాంగం అమల్లోకి వచ్చి, మన దేశం ఒక స్వయం పరిపాలిత దేశంగా మారిందని, విభిన్న సంస్కృతులతో కూడిన మనదేశం భిన్నత్వంలో ఏకత్వం నినాదంతో ప్రగతి పథంలో పయనించడానికి, మనకున్న హక్కులను పరిరక్షించుకోవడానికి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే ప్రధానమని దేవకుమార్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావు యాదవ్, ఫయాజ్, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, బాలసుధాకర్, మోహన్‌రెడ్డి, హుస్సేన్ బాషా, అల్లాద్దీన్, గణేష్, రాజేష్ రెడ్డి, రహమాన్, శ్రీరాములు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నీటిపారుదల సమస్యలు తీర్చండి

## • రాష్ట్ర నీళ్లమంత్రిని కలిసిన ఎంపీ వేమిరెడ్డి



నెల్లూరు జిల్లాలోని పలు నీటిపారుదల సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిమ్మల రామానాయుడుతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో నీటిపారుదలకు సంబంధించి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా కనిగిరి రిజర్వాయర్ అభివృద్ధిపై ఆయనతో మాట్లాడుతూ, ఆ రిజర్వాయర్ ఆధునికీకరణ ప్రాధాన్యాన్ని మంత్రికి వివరించారు. అలాగే పలు పెండింగ్ ప్రాజెక్టుల పనుల విషయాన్ని కూడా మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వాటిపై సానుకూలంగా స్పందించిన మంత్రి నిమ్మల.. నెల్లూరుజిల్లాలో నెలకొన్న నీటిపారుదల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు.

# వర్షిత్‌కు.. సీఎం సహాయనిధి నుంచి సాయం

## • 10 లక్షల చెక్కును అందజేసిన ఎంపీ వేమిరెడ్డి



లివర్ సమస్యతో బాధపడుతున్న తొమ్మిదేళ్ల వర్షిత్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 10 లక్షల రూపాయల చెక్కును నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. ఈనెల 28న విజయవాడలోని తన నివాసంలో ఆయన ఆ చెక్కును వర్షిత్ కుటుంబసభ్యులకు ఇచ్చారు. ఇందుకూరుపేట మండలం నరసాపురం గ్రామానికి చెందిన ఈదూరు మధు కుమారుడు వర్షిత్ కొద్దికాలంగా లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించేందుకు ఆ కుటుంబానికి ఆర్థిక స్తోమత లేక అయోమయంలో ఉండడంతో, స్థానిక జనసేన నాయకుడు గుడి హరిరెడ్డి ఆ విషయాన్ని వేమిరెడ్డి దంపతులకు తెలియజేశారు. వెంటనే స్పందించిన వేమిరెడ్డి దంపతులు ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆ బాలునికి సాయం అందేందుకు కృషిచేశారు.

ఈ విషయంలో వేమిరెడ్డి కుమారుడు అర్జున్‌రెడ్డి కూడా ప్రత్యేక చొరవ చూపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 10 లక్షల రూపాయల చెక్కు వచ్చింది. వర్షిత్ ఆరోగ్యం మెరుగుపడాలని ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు ఆకాంక్షించారు.

# వ్యర్థాలను తగ్గించడమే లక్ష్యంగా కృషి!

## ○ శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి



స్థిరమైన వ్యర్థాల నిర్వహణ, వనరుల సామర్థ్యం ప్రాధాన్యతను వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (ఏపీపీ సీబీ), శ్రీసిటీతో కలిసి 'రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్)-సర్క్యులర్ ఎకానమీ' అనే అంశంపై ఇటీవల సదస్సు జరిగింది. శ్రీసిటీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీ పీసీబీ ఛైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య, తిరుపతి సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సి.సెల్వం, పరిశ్రమల ప్రతినిధులు, అటవీ అధికారులు, పర్యావరణ నిపుణులు పాల్గొన్నారు. సదస్సుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం చెప్తూ, వర్తులాకార ఆర్థిక సూత్రాలను అవలంభించడంలో శ్రీసిటీ నిబద్ధతను పునరుద్ఘాటించారు. వ్యర్థాలను తగ్గించడానికి, వనరుల పరిపూర్ణ వినియోగానికి శ్రీసిటీలో స్థిరమైన పారిశ్రామిక పద్ధతులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం తాము చేపడుతున్న వ్యర్థాల నిర్వహణ చర్యలలో అత్యాధునిక రీసైక్లింగ్ కేంద్రం ఒకటి అని ఆయన అంటూ, సుస్థిర అభివృద్ధి నమూనాను రూపొందించడానికి పైసూత్రాలను అనుసరించాలని పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామన్నారు. పరిశ్రమలు సుస్థిర పర్యావరణ వ్యవస్థలుగా ఎలా రూపాంతరం చెందుతాయో అవగాహన చేసుకునేందుకు శ్రీసిటీ చక్కని ఉదాహరణ అని ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కృష్ణయ్య తెలిపారు. ఇక్కడ శుద్ధి చేయబడిన మురుగునీటిని తిరిగి ఉపయోగించడం, పారిశ్రామిక ఉప-ఉత్పత్తులను రీసైక్లింగ్ చేయడం, పునరుత్పాదక ఇంధన వినియోగం వంటి పద్ధతులను ప్రశంసించారు. అయినప్పటికీ, వ్యర్థాలను పారవేసే ఏజెన్సీలు నిబంధనలకు ఖచ్చితంగా కట్టుబడి ఉండేలా చూసుకోవడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులికాట్ సరస్సు పరివాహక ప్రాంతంలోశ్రీసిటీ ఉన్నందున, దాని జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం, పచ్చదనాన్ని పెంపొందించడం పరిశ్రమలకు అదనపు బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

పరిశ్రమల వ్యర్థాలను అడవులు, నీటి వనరులలో వేయడాన్ని నిరోధించాల్సిన ఆవశ్యకతను ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ కన్జర్వేటర్ సి.సెల్వం తెలియజేశారు. పారిశ్రామిక వృద్ధి పర్యావరణ పరిరక్షణతో కలిసి సాగాలన్నారు. అడవుల్లో వ్యర్థాలను పారవేయడం జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యతను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. సమిష్టిగా పారిశ్రామిక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత సాధించాలని పిలుపునిచ్చారు.

మిచిగాన్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ సుధాకర్ జి.రెడ్డి తన వర్చువల్ ఉపన్యాసంలో సుస్థిరత మరియు వ్యర్థాల నిర్వహణకు సంబంధించి అమలులో వున్న ప్రపంచ అత్యుత్తమ పద్ధతులను వివరించారు. శ్రీసిటీ పరిశ్రమలకు చెందిన సుమారు వంద మందికిపైగా మానవ వనరులు, పర్యావరణం, ఆరోగ్యం, భద్రత మేనేజర్లు ఈ సదస్సులో పాల్గొన్నారు.

# మాగుంట పార్వతమ్మ పేరు.. సార్థకం!

## కావలి ట్రంకురోడ్డుకు ఆమె పేరు పెడుతూ.. జీఓ జారీ



ఒంగోలు పార్లమెంట్ సభ్యురాలిగా, కావలి శాసనసభ్యురాలిగా ప్రజలకు అపారమైన సేవలందించిన దివంగత నేత మాగుంట పార్వతమ్మ పేరు సార్థకమైంది. నెల్లూరు-ప్రకాశం జిల్లాల ప్రజలకు, ప్రత్యేకించి ఒంగోలు, కావలి ప్రాంత ప్రజానీకానికి చేసిన సేవలకు గుర్తింపుగా, ఆమె జ్ఞాపకాలను ప్రజలు చిరకాలం గుర్తుంచుకునే విధంగా కావలి ట్రంకు రోడ్డుకు ఆమె పేరు పెడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీఓ ఆర్‌టీ నం.16, తేది 10.12.2024ని జారీచేసింది. స్వర్గీయనేత, మహాదాత మాగుంట సుబ్బరామరెడ్డి సతీమణి అయిన మాగుంట పార్వతమ్మ జ్ఞాపకార్థం ప్రభుత్వం కావలి ట్రంకురోడ్డును 'మాగుంట పార్వతమ్మ రోడ్డు'గా నామకరణం చేసి, మాగుంట కుటుంబ సేవలకు కూడా ధన్యత చేకూర్చింది.

### ముఖ్యమంత్రికి.. పార్వతమ్మ మనుమడి కృతజ్ఞతలు :



పార్వతమ్మ మనుమడు మాగుంట సుబ్బరామ్‌రెడ్డి మాట్లాడుతూ, 'మా నానమ్మ పేరు చిరస్థాయిగా ఉండేందుకు కావలి ట్రంకురోడ్డుకు ఆమె పేరు పెట్టడం సంతోషకరమని అంటూ, ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, అందుకు సహకరించిన కావలి ఎమ్మెల్యే డివి కృష్ణారెడ్డికి కూడా ధన్యవాదాలు తెలియజేశారు.

## కాకర్ల చొరవతో ఎట్టకేలకు..

# 'కొమ్మి' కాలువకు పెన్నమ్మ పరుగులు

## తీరిన అన్నదాత కష్టాలు..11వందల ఎకరాలు సాగులోకి



ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవతో ఎట్టకేలకు సత్యవోలు నుండి కొమ్మి చెరువుకు వెళ్లే కాలువకు పెన్నమ్మ పరుగులు పెట్టింది. అక్కడి రైతులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ కాలువ పూడికతీత పనులు కాకర్ల ఆదేశాలతో అధికారులు శరవేగంగా చేపట్టారు. దీంతో దాదాపు 11వందల ఎకరాలకు సాగునీటి కొరత తీరిపోవడంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని సత్యవోలు నుండి కొమ్మి గ్రామంలోని చెరువుకు వెళ్లే కాలువ గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురై పిచ్చిచెట్లతో, పూడికతో నిండిపోయింది. దీంతో చెరువుకు నీరు రాక 11 వందల ఎకరాలు బీడుభూములుగానే మిగిలిపోయాయి. కొండాపురం మండలం కొమ్మి చెరువుకు సంబంధించిన నీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి సురేష్, గ్రామస్తులు తమ సమస్యను తొలుత ఎమ్మెల్యే కాకర్లకి తెలియజేశారు. అందుకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నీటిపారుదల అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన కాలువ పూడికతీత పనులు చేయాలని ఆదేశించడంతో, జేసీబీల సహాయంతో రాత్రి పగళ్ళు పనిచేయించి ఇటీవలే కాలువ పూడికతీత పనులు పూర్తిచేశారు. సోమశిల జలాలు కుదుములదిన్నెపాడు వద్ద కటింగ్ పాయింట్ నుండి సత్యవోలుకు వస్తాయి. అక్కడనుండి 2.6 కిలోమీటర్ల కాలువ పనులు పూర్తికావడంతో పెన్నానది జలాలు కొమ్మి చెరువులోకి చేరాయి. దీంతో, గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన 1100 ఎకరాల భూమి సాగులోకి రావడంతో రైతన్నలు ఆనందంతో తమను ఆదుకున్న ఎమ్మెల్యే కాకర్లకి ధన్యవాదాలు తెలిపారు. అన్నదాతల తరఫున సాగునీటి సంఘం అధ్యక్షులు ఆయనకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.






## జానకిరామ.. రామాయణం 50

- ఊటుకూరు జానకి రామారావు



బయలుదేరాడు రాఘవుడు సతీసోదర సమేతంగా!

బాటలు నడచినడచి అత్రి మహర్షి ఆశ్రమం చేరుకున్నాడు.

(అత్రి మహర్షి సప్తర్షులలో ఒకరు. ఆయన సామాన్యుడు కాదు. తాపత్రయములు మూడు. అవి.. ఆధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవికాలు.. ఈ మూడు తాపాలు కూడా లేని మహాజ్ఞాని అత్రి.. అనగా మూడు లేని వాడు అని అర్థం! ఏ మూడు అంటే పైన చెప్పబడిన తాపత్రయములు)

అత్రిమహాముని ఆశ్రమానికి చేరుకున్న సీతారామలక్ష్మణులు ఆయనకు నమస్కరించి నిలుచున్నారు. వీరిని చూడగానే ఎక్కడలేని సంతోషం కలిగింది మహర్షికి.

ఆయన రాముడిని స్వంత కొడుకులాగ ఆదరించాడు. స్వయంగా తానే ఆతిథ్యమిచ్చాడు.

ఆయన తన భార్య అయిన అనసూయాదేవిని అక్కడికి పిలిచి ఆమె సముఖంలో మంచిమాటలతో వారిని సంతోష పెట్టాడు.

సీతాదేవిని అనసూయదేవికి అప్పగించి ఆమెగూర్చి రాముడితో "ఈమె అనసూయ గొప్ప తపఃసంపన్నురాలు, పదివేల సంవత్సరాలు తపస్సు చేసింది. ఎన్నో వ్రతాలు పూర్తిచేసింది.

ఈమె తన గొప్ప పనులచేత "అనసూయ" (కోపం, అసూయ లేనిది) అని లోకంలో ప్రసిద్ధి చెందింది"...అని తెలిపారు మహర్షి.

అనసూయామాత వద్దకు సీతాదేవి వచ్చి ఆమెకు ప్రదక్షిణం చేసి వినయంగా తన పేరుచెప్పి నమస్కరించింది.

అప్పుడు ఆ వృద్ధ తాపసి "అమ్మాయీ విన్నానే నీ గురించి! నీవు ధర్మాన్ని చక్కగా పాటిస్తున్నావని తెలుసుకొన్నాను. బంధుజనాన్ని, అహంకారాన్ని వదలి అడవికివెళుతున్న నాథుడిని అనుసరిస్తున్నావు.

ఏ స్త్రీ అయితే భర్త వనంలో ఉన్నా, నగరంలో ఉన్నా, వాడు పాపాత్ముడు కానీ, పుణ్యాత్ముడు కానీ అతనిని అనుసరిస్తూ ఉంటుందో ఆ స్త్రీకి ఉత్తమ లోకములు కలుగుతాయి".

"సీతా, భర్తను మించిన బంధువు ఎవరైనా ఉన్నారా?

మనస్సును కామానికి వశం చేసిన స్త్రీలు భర్తలమీద అధికారం చెలాయిస్తూ మంచిచెడ్డలు తెలుసుకోలేరు."... అని తనను గూర్చి అనసూయామాత పలికిన మాటలు విని సీతాదేవి...

"అమ్మా స్త్రీకి భర్త పూజ్యుడు అనే విషయం నాకు తెలుసు. భర్త ఎంత చరిత్రహీనుడైనా అతనిని తప్పక పూజించవలసిందే.

అలాంటిది గుణాలచేత శ్లాఘింపదగినవాడు, దయామయుడు, జితేంద్రియుడు, స్థిరమైన ప్రేమగలవాడు, ధర్మాత్ముడూ, నా తల్లివలే, తండ్రివలే నాకు చాలా ఇష్టుడు అయిన నా భర్త గురించి వేరే చెప్పాలా?

తన తల్లి కౌసల్య విషయంలో ఏ విధంగా ప్రవర్తించునో ఇతర రాజభార్యల విషయంలో కూడా అలాగే ఉంటాడు రామచంద్రుడు.

అంత ఎందుకు దశరథుడు ఒక్కమాటు చూసిన స్త్రీని కూడా తన తల్లిలాగ గౌరవిస్తాడు.

అమ్మా! నాకు నా తల్లి, అత్తగారు ఇరువురూ ఉపదేశించిన మాటలను మనస్సులో ఉంచుకొన్నాను.

స్త్రీకి పతి శుశ్రూషే పెద్ద తపస్సు.. వేరే ఏ తపస్సు అవసరంలేదు.

నాకు సావిత్రి, రోహిణి ఆదర్శం అని పలుకుతున్న సీతమ్మను దగ్గరకు తీసుకొని ముద్దుగా శిరస్సుపై ఆఘ్రాణించింది అనసూయామాత.

సీతాదేవిని చూస్తుంటే ఆవిడకు సంతోషం! ఆవిడ మాటలకు మెచ్చి ఏదైనా ఇవ్వాలనుకొని "సీతా! నీకు ఏమి వరం కావాలో కోరుకో అమ్మా! నీకు కావలసింది ఇస్తాను". అని పలికింది అనసూయామాత.

తల్లీ! నీ ఆప్యాయతే నాకు కొండంత వరం. నాకు అది చాలు అని బదులిచ్చింది సీతమ్మ.

పెద్దలకు అనుగ్రహం కలిగితే ఆగరుకదా!

విదేహపుత్రీ! ఇదిగో నీకు దివ్యములు, శ్రేష్ఠములు అయిన ఈ పూలమాలలు, వస్త్రము, అలంకారములు, అంగరాగం, శ్రేష్ఠమైన మైపూతను ఇస్తున్నాను.

ఇవి ఎల్లప్పుడు ఉంటాయి. ఈ వస్త్రం మాయదు, నలగదు. ఈ దివ్యమైన అంగరాగం పూసుకొని నీవు నీ భర్తను శోభింప చేయగలవు. అనురాగంతో అనసూయామాత ఇచ్చిన వస్తువులు స్వీకరించింది సీతమ్మ.

స్థిరనియమాలు గల అనసూయా మాత తనకు ప్రియం కలిగించే ఒక విషయం సీతమ్మను అడిగింది.

అమ్మాయీ చెప్పవే! నీ వివాహపు ముచ్చట్లు!

సీతమ్మను దగ్గరగా కూర్చోపెట్టుకుని మురిపెంగా చూస్తూ అడిగింది ముదుసలి ముత్తయిదువ మహాసాధ్వి అనసూయా మాత.

ఆవిడకు సీతమ్మ చెప్పే కబుర్లు మహదానందాన్ని కలిగిస్తున్నాయి.

సీతమ్మ సవివరంగా తను తన తండ్రికి ఏవిధంగా దొరికింది, తన స్వయంవరాన్ని ఎలా ప్రకటించిదీ, మహర్షి విశ్వామిత్రులవారితో రామలక్ష్మణులు వచ్చిన సంగతీ, రాముడు ఏవిధంగా వింటిని ఎక్కుపెట్టి విరిచిన విషయం తెలిపింది.

రాముడు శివధనుర్భంగం గావించిన వెంటనే నన్ను రామునకు ఇచ్చుటకై నా తండ్రి చేతిలోనికి జలకలశం తీసుకొన్నాడు.

కానీ!

రాముడు అందుకు అంగీకరించలేదు!

తన తండ్రీ, ప్రభువూ అయిన దశరథ మహారాజు అభిప్రాయం తెలుసుకోకుండా స్వీకరించను అని వినయంగా మా నాన్నగారికి తెలియచేశాడు.

అప్పుడు, జనకమహారాజు దశరథమహారాజుకు కబురుపెట్టి ఆయన వచ్చి తన సమ్మతిని తెలియచేసిన తరువాత మాత్రమే నన్ను స్వీకరించాడు రాముడు.

మా చెల్లెళ్ళకు కూడా అదే సమయంలో లక్ష్మణ, భరత, శత్రుఘ్నులతో వివాహం జరిపించారు మా తండ్రిగారు.

అని తమ వివాహ వృత్తాంతాన్ని అనసూయామాతకు తెలిపింది సీతమ్మ.

చిన్నపిల్లల ముద్దుముద్దు మాటలు మన హృదయానికి ఎంత ఆహ్లాదకరంగా ఉంటాయో సీతమ్మ పలుకులు కూడా అంతే ఆహ్లాదకరంగా ఉన్నాయి అనసూయామాతకు.

సీతమ్మ పెళ్ళిముచ్చట్లు చెప్పించుకొని సంబరపడిపోయింది ఆ మహాసాధ్వి.

అమ్మా సీతా! నీవు ప్రతి అక్షరం స్పష్టంగా, ప్రతి పదాన్ని మధురంగా పలికి నన్ను సంతోషపెట్టావే బంగారుతల్లీ. చాలా బాగుందమ్మా!

ఇక రాత్రి అవుతుంది, పక్షులన్నీ తమతమ గూళ్ళు చేరుకొంటున్నాయి. నేనిచ్చిన వస్తువులు అలంకరించుకొని రాముడి వద్దకు ఇక వెళ్ళమ్మా అని అనగా... సీతమ్మ అట్లే చేసి, ఆమెకు శిరస్సు వంచి నమస్కరించి రాముని వద్దకు వెళ్ళింది.

అనసూయామాత ఇచ్చిన ఆభరణాలు, వస్త్రాలు ధరించి నూతనశోభతో కనపడుతున్న తన రమణి సీతను చూడగనే రాముడి హృదయంలో మధురభావనలు పులకలెత్తాయి.

మనుష్యులలో ఎవరికీ దక్కని గౌరవం తన భార్యకు దక్కినందుకు చాలా సంబరపడిపోయాడు రామయ్య.

ఆ రాత్రి గడిచింది. తెల్లవారగనే అగ్నిహోత్రం పూర్తి చేసుకొని ఉన్న మునులందరూ సీతారామలక్ష్మణులకు వీడ్కోలు పలికారు.

అరణ్యంలోనికి ప్రవేశించుచున్న వారికి ఎన్నో జాగ్రత్తలు చెప్పారు వారు. రామా చాలా జాగ్రత్తగా ఉండాలి సుమా.

ఈ అడవిలో నరమాంసభక్షకులైన రాక్షసులు వివిధ రూపాలలో సంచరిస్తూ ఉంటారు. రక్తం త్రాగే క్రూరమృగాలు ఎన్నో ఉన్నాయి. వాటిని జాగ్రత్తగా తప్పించుకొని వెళ్ళు.. అని అరణ్యంలోనికి వారు వెళ్ళిరావడానికి నిత్యం ఉపయోగించే మార్గాన్ని చూపించారు.

అందరికీ నమస్కరించి బయలుదేరిన సీతారామలక్ష్మణులు దట్టమైన మబ్బులలో దూరే సూర్యుడిలాగా ఆ అడవులలో ప్రవేశించారు.

నేటితో "అయోధ్యకాండ సమాప్తం"

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః

.. (సశేషం)

# ఏపీపై బీజేపీ కన్ను!

మనసులో మాట 30

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు ఊహించినదానికన్నా ముందే ఊపందుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు నిండక ముందే కొత్త గానాలు వినపడుతున్నాయి. కొంత కాలంగా ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు నేతలు, ప్రముఖ వ్యక్తుల కేంద్రంగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే రాష్ట్రంలో తదుపరి ఎన్నికల నాటికి అత్యంత కీలకపాత్ర పోషించడానికి భారతీయ జనతాపార్టీ ఇప్పటినుంచే పకడ్బందీగా రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు కనబడుతోంది. ముందుగా గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయిన అంశం తిరుమల లడ్డూ అంశం. జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తీవ్ర ఆరోపణలు చేయడమే కాకుండా విచారణకు ఆదేశించారు. జగన్‌పై అన్ని వైపుల నుంచి విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులు కూడా జగన్‌పై విరుచుకుపడ్డారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అయితే రాష్ట్రంలో సనాతన ధర్మానికి తీవ్ర ముప్పు వాటిల్లిందని విరుచుకుపడి, సనాతనధర్మాన్ని కాపాడుకోవడానికి దేనికైనా సిద్ధమన్నారు. 11 రోజులపాటు ప్రాయశ్చిత్త దీక్ష చేశారు. దీక్ష అనంతరం విజయవాడ కనకదుర్గ గుడి మెట్లను కడిగి శుద్ధి చేసినట్లు చెప్పారు.

మరోవైపు తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనలో భాగంగా జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ దక్షిణాది కేంద్రాన్ని విజయవాడ సమీపంలో ప్రారంభించి ప్రసంగించినప్పుడు జగన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ హయాం ఒక మానవ ప్రేరేపిత విపత్తు అని దుయ్యబట్టారు. జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లు రాష్ట్రంలో తీవ్ర విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు.

ఈ రెండు పరిణామాలు కాకుండా నేరుగా రాజకీయాలతో ముడిపడి ఉన్న పరిణామాలను గమనిస్తే గతంలో వైకాపాకు చెందిన బీదమస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణలు తమ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరారు. వైకాపాలో నంబర్2గా ఉన్న విజయసాయిరెడ్డి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడమే కాకుండా రాజకీయాల నుంచి విరమించుకుంటున్నట్లు ప్రకటించడం అన్నింటికన్నా పెద్ద పరిణామం. ఈ పరిణామాల వరకు చూస్తే జగన్‌ను రాజకీయంగా బలహీనం చేసే ఎత్తుగడతో కూటమి పనిచేసినట్లు కనబడుతోంది. కూటమిలో రాష్ట్రంలో తెలుగుదేశం పెద్దన్నలా కనబడవచ్చు కానీ కేంద్రస్థాయిలో చూసినప్పుడు భాజపానే పెద్దన్న. వైకాపాను బలహీనం చేస్తే తమకొచ్చే ప్రయోజనమేమిటో లెక్కలు వేసుకోకుండా భాజపా ఉండదు.

రాజకీయంగా నేరుగా ముడిపడి ఉన్న మరో పరిణామాన్ని పరిశీలిద్దాం. చాలా నియోజకవర్గాల్లో మొన్నటివరకు వైకాపా వీరవిధేయులుగా ఉండి, చంద్రబాబన్నా, తెలుగుదేశమన్నా తీవ్ర విద్వేషాన్ని వెళ్లగక్కిన పలువురు చోటామోటా నాయకులు భాజపాలో చేరుతున్నారు. వారంతా ఇప్పటికీ తెలుగుదేశంపై తీవ్ర విద్వేషంతోనే ఉన్నా భాజపా వారిని కాదనడం లేదు. మరోవైపు ఇటీవల ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవికి దక్కిన ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. ప్రధాని మోదీ చిరంజీవితో ఎక్కువ సమయం గడిపి ఆయనకు చాలా ప్రాధాన్యమిచ్చారు. చిరంజీవి సోదరుడు, జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రానికి సంబంధించిన కొన్ని అంశాల్లో ఆయన బహిరంగంగానే పదునైన మాటలతో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. హోంమంత్రి అనితపై ఎక్కుపెట్టిన వాగ్బాణాలు కావచ్చు, కాకినాడ ఓడరేవులో బియ్యం ఎగుమతుల అంశం కావచ్చు... నాలుగు గోడల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి పరిష్కరించుకునే అవకాశం ఉన్నా ఆయన బహిరంగంగానే విమర్శలు చేశారు. మరోవైపు పైన పేర్కొన్నట్లు సనాతనధర్మ మంత్రాన్ని జపిస్తున్నారు. వైకాపాకు చెందిన పలువురు కీలక నేతలను జనసేనలోనూ చేర్చుకుంటున్నారు. మెగాస్టార్, పవర్ స్టార్ పరిణామాలను కలిపి చూసినప్పుడు వారిద్దరి సహకారంతో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడానికి భాజపా రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు కనబడుతోందని రాజకీయ విశ్లేషకుల నుంచి వినపడుతున్న మాట.

రాజధాని నిర్మాణం కావచ్చు, పోలవరం నిర్మాణం కావచ్చు, విశాఖ ఉక్కుకు ప్రకటించిన ప్యాకేజి కావచ్చు.. ఈ అంశాలన్నింటినీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, భాజపా నేతృత్వంలో కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి పుష్కలంగా నిధులు ఇస్తూ అండగా ఉంటోందని ప్రచారం చేయాలని అమిత్ షా రాష్ట్ర భాజపా నేతలను గట్టిగా ఆదేశిస్తున్నారు. ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తే ఒకవైపు తెలుగుదేశం సహకారంతో వైకాపాను బలహీనపర్చడం, మరోవైపు తమ ప్రాబల్యాన్ని విస్తరించుకోవడం అనే ద్విముఖ వ్యూహంతో భాజపా అడుగులు వేస్తున్నట్లు స్పష్టంగా కనబడుతోంది. భాజపా ప్రధాన అస్త్రం మొదటి నుంచి హిందూ జాతీయ వాదం. హిందూవాద సంస్థలు భాజపాకు అండగా నిలబడతాయి. ఆ దిశగానూ ఆంధ్రప్రదేశ్‌లో భాజపా పావులు కదుపుతోంది. ఇటీవల కాలంలో విజయవాడ సమీపంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం పేరుతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. దేశంలో పలుచోట్ల హిందూ ఓటు బ్యాంకును ప్రోది చేసుకోవడానికి ఇటువంటి సభలు ఉపయోగపడిన ఉదాహరణలు గతంలో ఉన్నాయి. అయితే ఇటువంటి సభను జగన్ హయాంలో ఎందుకు పెట్టలేదనే ప్రశ్న అడగడం రాజకీయంగా అవివేకమే. గత ఐదేళ్లు రాష్ట్రంలో జగన్ తీవ్ర విధ్వంసం సృష్టించారన్న అమిత్ షా అప్పుడెందుకు నోరు విప్పలేదని జగన్ సోదరి, కాంగ్రెస్ నాయకురాలు షర్మిల వేసిన ప్రశ్నకు సమాధానం ఆమెకూ తెలుసు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఎవరూ ఉండరన్నదే అసలైన సమాధానం.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# ఫిబ్రవరి 1న..శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ రాక

## 3 రోజుల పాటు శ్రీకృష్ణయోగ మందిరంలో విశేష పూజలు



మైసూరు అవధూత దత్తపీఠాధిపతి, జగద్గురు పరమపూజ్య శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ తమ దత్తక్షేత్ర యాత్రలో భాగంగా ఫిబ్రవరి 1న నెల్లూరుకు వస్తున్నారని, ఆ సందర్భంగా స్థానిక సుజాతమ్మ కాలనీలోని శ్రీకృష్ణయోగ మందిరంలో, శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో మూడు రోజులపాటు ప్రత్యేకపూజలు నిర్వహిస్తారని శ్రీ గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞాన బోధ సభ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ, ప్రముఖ వైద్యులు సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలియజేశారు. దత్తపీఠం ఉత్తరాధిపతి శ్రీ దత్త విజయానందతీర్థస్వామితో కలసి స్వామీజీ ఈ యాత్రలో ఇక్కడికి వస్తున్నారని ఆయన చెప్పారు. ఆమేరకు ఆహ్వానపత్రికలను ఈనెల 28న మందిరం ట్రస్టీలు అనపల్లి మస్తాన్‌రెడ్డి, టి.ఫణిరత్నం తదితరులతో కలసి ఆయన ఆవిష్కరించారు. శ్రీ గణపతి సచ్చిదానందస్వామి వారి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ రథసప్తమి రోజు వరకు విశేషపూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

### 2న..'కృష్ణామృత రాగ సాగర'

ఈ సందర్భంగా ఫిబ్రవరి 2వ తేది ఉదయం గోపూజ, శ్రీచక్రార్చన, శ్రీ లక్ష్మీనారాయణ హోమం నిర్వహిస్తారని,



ఎస్‌జిఎస్ భజన బృందం వారిచే శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీవారి దివ్య నామ సంకీర్తనలతో సంగీత సేవ, పూజా కార్యక్రమాలుంటాయని, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆయన తెలిపారు. సాయంత్రం 6 గంటలకు 'కృష్ణామృత రాగ సాగర' అనే అద్భుతమైన కార్యక్రమం ఉంటుందని, నాదబ్రహ్మ శ్రీ గణపతి సచ్చిదానందస్వామి వారిచే జరిగే ఈ నాద ధ్యాన చికిత్సా కచేరీ ఎంతో విశిష్టమైనదని ఆయన పేర్కొంటూ, ఈ కార్యక్రమం మాత్రం కేవలం పాస్‌లు ఉన్నవారికే పరిమితమని, భక్తులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

### వసంత పంచమి రోజున శ్రీ సరస్వతీదేవి పూజ :

ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా ఫిబ్రవరి 3న వసంతి పంచమి సందర్భంగా ఆరోజు ఉదయం గోపూజ, శ్రీచక్రార్చనలతో పాటు శ్రీ సరస్వతీదేవి పూజ, సరస్వతీ హోమం నిర్వహిస్తామని తెలిపారు. శ్రీ నాగేశ్వరస్వామివారికి రుద్రాభిషేకార్చనల అనంతరం సరస్వతీ దేవి అమ్మవారి అనుగ్రహాశీస్సులతో విద్యార్థులకు పెన్‌లు, పుస్తకాలు పంపిణీ చేస్తామని, ఆ తర్వాత భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం దివ్యనామ సంకీర్తన జరుగుతుందన్నారు. 4వ తేదీన రథసప్తమి పర్వదినం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ సూర్య భగవానునికి విశేషపూజలు, అర్చనలు నిర్వహిస్తామని, ఆ తర్వాత సూర్యహోమం జరుగుతుందని వివరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీ గణపతి సచ్చిదానందస్వామివారి అశీర్వచనాలు అందుకోవాలని ఆయన కోరారు.



జనవరి 25న బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో బెంగళూరులో జరిగిన సంక్రాంతి సంబరాల్లో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరితో వేదికపై గౌరవపూర్వకంగా మాట్లాడుతున్న కర్నాటక టీడీపీ కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి

# ఎన్‌బికెఆర్‌లో.. గణతంత్ర వేడుకలు



జనవరి 26న 76వ గణ తంత్ర దినోత్సవం సందర్భంగా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వేడుకలు జరిగాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా జాతీయపతాకానికి కళాశాలలోని ఎన్‌సిసి, ఆర్మీ, నేవీ క్యాడెట్ల గౌరవ వందనం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం కళాశాల విద్యార్థులు, ఎన్‌సిసి క్యాడెట్లు దేశభక్తి గీతాలకు నృత్యం చేశారు. పిరమిడ్స్ మరియు యోగ మీద అవగాహనా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం, ఎన్‌సిసి క్యాంపులలో పాల్గొన్న క్యాడెట్లను అభినందించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ఎన్‌సిసి అధికారులు మాధవయ్య, మల్లికార్జున్‌రెడ్డి, వ్యాయమ అధ్యాపకులు శోభారాణి, రాముకుమార్, వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

---

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# రోడ్డు ప్రమాదాల నివారణలో యువత కీలకం

**డీఎస్పీ గీతాకుమారి**



రోడ్డు ప్రమాదాల నివారణలో యువతే కీలకంగా మారాలని, వారు బాధ్యతగా వాహనాలు నడిపితే ప్రమాదాలు తగ్గించవచ్చని డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జనవరి 28న గూడూరు పట్టణంలోని గడియారపు స్తంభం కూడలి నుంచి బైకు ర్యాలీని నిర్వహించారు. హెల్మెట్ విధిగా ధరించాలని తెలిపారు. అతివేగం, నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపడం వల్ల ఎంతో మంది విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని తెలియజేశారు. ఆర్టీవో కిషోర్, సి.ఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# నాగవల్లికి ఏసీపీగా పదోన్నతి



గూడూరు మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న వి.నాగవల్లికి ప్రభుత్వం అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించి రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేసింది. ఈ సందర్భంగా నాగవల్లిని గూడూరు మున్సిపల్ కమిషనర్ అన్నవరం వెంకటేశ్వర్లు, వారి సిబ్బంది ఘనంగా సత్కరించారు. టౌన్ సర్వేయర్ రామకృష్ణ, టిపిబిఓ శ్రీను, రామన్, టౌన్‌ప్లానింగ్ దీనరాజు తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా ఎల్‌ఏపి 40వ వార్షికోత్సవం





చిల్లకూరు శారదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ పాఠశాలలో 40వ వార్షికోత్సవ కార్యక్రమం జనవరి 29వ తేదీ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ మోటివేషన్ స్పీకర్ సుధీర్ శాంద్రా మాట్లాడుతూ... సమాజంలో తల్లి, తండ్రి, గురువులకు మించిన హీరోలు లేరని, విద్యార్థులకు విద్యతోపాటు విలువలు కూడా నేర్పించాలని, విద్య యొక్క ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించారు. కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్యను అందించడమే ఎల్‌ఏపి ముఖ్య లక్ష్యమని, విద్యార్థుల అభ్యున్నతికి ప్రతినిత్యం తోడ్పాటు అందించడం జరుగుతుందని, పిల్లలందరూ చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. చదువులో ప్రతిభ కనపరిచిన విద్యార్థినీవిద్యార్థులకు బహుమతులందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ఫౌండర్ బి.సుబ్రహ్మణ్యం రెడ్డి, పిఈటి సెక్రటరీ దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నమఃశివాయ, ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడలలో రాణించడం ద్వారా శారీరక దృఢత్వం పెంపొందించుకోవడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవచ్చని గూడూరు డిఎస్పీ గీత తెలిపారు. గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో నిర్వహించిన యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌ను ఇటీవల ఆమె ప్రారంభించారు. క్రీడలు, వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులను ఆమె అభినందిస్తూ పురస్కారాలు అందజేశారు. క్రీడలలో మహిళలు రాణించి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థినిలు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవడం చాలా అవసరమని సూచించారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవం



రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికి అనేక హక్కులు కల్పించారని, ప్రతి ఒక్కరు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా వెల్లడించారు. గూడూరు పట్టణంలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే సునీల్‌కుమార్, డీఎస్పీ గీత, తహసిల్దార్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. అనంతరం, పలు శాఖలలో విశిష్ట సేవలు అందించిన వారికి సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఎమ్మెల్యే సునీల్‌కుమార్, డీఎస్పీ గీత ప్రశంసా పత్రాలు అందజేసి, వారందరినీ అభినందించారు.

# ఏ-2 'రాజీ'నామా

(మొదటిపేజీ తరువాయి)

అంచెలంచెలుగా ఎదిగారు. ఈ క్రమంలో వైఎస్ జగన్ అక్రమాస్తుల విస్తరణకు కర్త, ఖర్మ, క్రియగా పనిచేశారనే ఆరోపణలను భుజానకెత్తుకున్నారు. సూట్‌కేసు కంపెనీలని ప్రారంభింపచేసి అవినీతి సొమ్మును తొలుత విదేశాలకుతరలించి తర్వాత రాజ మార్గంలో జగన్ కంపెనీల్లో పెట్టుబడుల రూపంలో తీసుకొచ్చి అవినీతి సామ్రాజ్య విస్తరణకు పూర్తి స్థాయిలో బీజాలు వేశారనే అపఖ్యాతి మూటగట్టుకున్నారు. ఇక వైఎస్సార్ మరణానంతరం ఎదురైన ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఏకంగా 11 సీబీఐ, ఈడీ కేసుల్లో వైఎస్ జగన్‌తో పాటు ఏ-2 ముద్దాయిగా ఉన్న ఆయన ఏడాదికిపైగా జైలు జీవితం గడిపారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత 2016 నుంచి పూర్తిస్థాయి రాజకీయాలపై దృష్టి సారించారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరపున రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఇక 2019-24 మధ్య కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి, రాష్ట్రంలోని వైఎస్ జగన్ ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించారు.

## కేంద్ర పెద్దలతో చెట్టాపట్టాల్...

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్డీయేలో చేరకున్నా 2019-24 మధ్య అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికి కావాల్సిన పనులను విజయసాయిరెడ్డి చక్కగా చక్కబెట్టారు. ఈ క్రమంలో ఢిల్లీలో అన్నీ తానై వ్యవహరిస్తూ మోడీ, షాలని బాగానే ప్రసన్నం చేసుకున్నారనే ప్రచారం సాగింది. ఒకానొక సమయంలో జగన్‌కు కూడా దొరకని ప్రధాని అపాయింట్‌మెంట్ విజయసాయిరెడ్డికి ఈజీగా దొరుకుతుందనే వ్యాఖ్యానాలు సైతం వినిపించాయి. ఇక 2019 ఎన్నికల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ దేశంలోనే మూడో అతిపెద్ద పార్టీగా లోక్‌సభలో అవతరించడంతో పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఢిల్లీలో విజయసాయిరెడ్డి పూర్తి స్థాయిలో చక్రం తిప్పారు. చివరికి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల్లోనూ ఛైర్మెన్‌గా, సభ్యుడిగా నియమితులై తిరుగులేని అధికారంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారనడానికి సందేహం అక్కరలేదు.

## వివాదాలతోనే సహవాసం..

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కోడికత్తి వివాదం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానంలో పింక్ డైమండ్ వ్యవహారం వరకు ప్రతి విషయంలోనూ చంద్రబాబు కుటుంబంపై తీవ్ర ఆరోపణలతో విజయసాయిరెడ్డి రెచ్చిపోయారు. ముఖ్యంగా ట్విట్టర్‌లో ఆయన పెట్టే పోస్టులు అత్యంత వివాదాస్పదమయ్యాయి. అనేక సందర్భాల్లో ఆయన వాడిన భాషపై కూడా వివిధ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇక వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిగా ఉంటూ విశాఖలో భారీ భూదోపిడీకి పాల్పడ్డారనే అపఖ్యాతి సంపాదించుకున్నారు. దాదాపు 2 లక్షల చదరపు మీటర్ల మేర భూకబ్జాలకు పాల్పడ్డారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి వ్యవహారంలో విజయసాయిరెడ్డిపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆమెతో బిడ్డను కూడా కన్నారని.. ప్రతిపక్షాలు సహా, ఆమె భర్త కూడా ఆరోపించడం సంచలనం రేపింది. అయితే, ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని నిరాధార ఆరోపణలు చేసిన వారిపై కోర్టుకెళ్తానంటూ అప్పట్లో విజయసాయి ఆగ్రహించారు. ఏదైమైనా ఈ విషయంలో విజయసాయిరెడ్డి ఇమేజ్ పాతాళానికి చేరిపోయిందనే వాదనలున్నాయి. ఇక కాకినాడ పోర్టులో వాటాల కోసం బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై సీఐడీ కేసులతో పాటు ఈడీ విచారణను ఎదుర్కొన్నారు. తాజాగా విశాఖలో భూ కుంభకోణానికి సంబంధించి కూటమి ప్రభుత్వం ప్రత్యేక నివేదిక రూపొందించి కేసుల నమోదుకు చర్యలు చేపట్టనుందనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో అకస్మాత్తుగా విజయసాయిరెడ్డి తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి సంచలనం రేపారు.

## అబద్ధాలు చెప్పే అలవాటు లేదంటూనే..

ఇక రాజకీయ సన్యాసానికి సిద్ధమయ్యానంటూ రాజీనామా పత్రాన్ని రాజ్యసభ ఛైర్మెన్ జగదీప్ దన్కడ్‌కు సమర్పించి ఆమోదింపజేసుకున్నారు. ఈక్రమంలో ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ ఊహకందని స్థాయిలో అసత్యాలు, అర్ధసత్యాలు ప్రకటించారనే విమర్శలు ఎదుర్కొన్నారు. ఆడిటర్ స్థాయి నుంచే అబద్ధాల పుట్టగా.. తప్పుడు లెక్కల్లో దిట్టగా.. దోపిడీకి ఆది గురువుగా లెక్కకి మిక్కిలి విమర్శలు మూటగట్టుకున్న విజయసాయిరెడ్డి చివరి ప్రసంగంలోనూ అబద్ధాలను అలవోకగా చెప్పేశారు. జర్నలిస్టులు సైతం విస్తుబోయేలా తనకు అబద్ధమంటే తెలియదని, అవినీతి చేయాల్సిన అవసరం లేదంటూ జాణతనాన్ని ప్రదర్శించారు. ఏపీ వినాశనానికి సూత్రధారిగా, వేలకోట్లు దోచుకున్న వ్యక్తిగా, అవినీతిలో జగన్‌కు అవిభక్త కవల సోదరుడిగా ఆరోపణలు ఎదుర్కొంటూ కూడా అవినీతి అంటే తనకు తెలిదయంటూ తిరుమల వేంకటేశ్వరుడి సాక్షిగా ప్రమాణం చేయడం విశ్లేషకులను సైతం విస్మయానికి గురి చేసింది. తప్పుడు లెక్కలతో దొంగ కంపెనీలకు ఆజ్యం పోసి, వాటి షేర్ విలువను అడ్డగోలుగా పెంచి అవినీతి తిమింగలం అనే స్థాయికి చేరుకుని ఇప్పుడు గౌతమబుద్ధుడి తరహాలో మాట్లాడడంపై నాయకులు సైతం విస్తుబోతున్నారు.

## ఆంధ్ర శశికళను తట్టుకోలేకనే..?

జగన్ ప్రభుత్వంలో సకలశాఖ మంత్రిగా గుర్తింపు పొంది, ఆ పార్టీ భ్రష్టు పట్టడానికి ప్రధాన కారణమైన సజ్జల రామకృష్ణారెడ్డి(ఆంధ్ర శశికళ)తో విభేదాలు తీవ్రస్థాయికి చేరడంవల్లే విజయసాయిరెడ్డి పార్టీ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు కూడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో గతంలో తాను నిర్వహించిన పార్లమెంటరీ పార్టీ నేత పదవిని వైవీ సుబ్బారెడ్డికి కట్టబెట్టడం, పార్టీ అనుబంధ సంఘాల బాధ్యతను తన నుంచి వేరుచేసి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అప్పగించడం, సోషల్ మీడియా బాధ్యతలను కూడా సజ్జల కుమారుడు భార్గవ్‌రెడ్డికి అప్పగించడం, ఇష్టం లేకున్నా.. గత ఎన్నికల్లో నెల్లూరులో పోటీ చేయించడం విజయసాయిరెడ్డి ఇగోను దెబ్బ తీసిందని కూడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక ఎన్నికల్లో ఓటమి అనంతరం అయిష్టంగానే ఉత్తరాంధ్ర బాధ్యతలు తీసుకున్నా.. అక్కడ బొత్సా సత్యనారాయణతో పొసగకపోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చినట్లు సమాచారం. ఇదే సమయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్ తనను దూరం పెట్టడం కూడా సాయిరెడ్డికి మనస్థాపం కలిగించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే వైఎస్ కుటుంబానికి అనుకూలుడినని చెప్పుకుంటానే.. కష్టకాలంలో ఉన్న పార్టీని అర్థాంతరంగా వదిలేసి వెళ్లిపోయారనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

## రాజీనామాపై భిన్న వాదనలు

విజయసాయిరెడ్డి రాజీనామాపై అనేక పార్టీలు వివిధ రకాలుగా స్పందించాయి. ముఖ్యంగా సొంత పార్టీ వైఎస్సార్‌సీపీ ప్రతిస్పందనపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. లండన్‌లో ఉన్న వైఎస్ జగన్‌కు విషయాన్ని ముందే తెలియజేశానని విజయసాయిరెడ్డి చెప్పడం ఆసక్తి రేపింది. విషయం తనవరకు వచ్చినా ఎందుకు జగన్ నష్ట నివారణ చర్యలు చేపట్టలేదనే ప్రశ్న ఉత్పన్నమైంది. అలాంటి సమయంలోనే విజయసాయిరెడ్డి నిర్ణయంతో ఏకీభవించకున్నా.. గౌరవిస్తామని పార్టీ అధిష్టానం ఓ ప్రకటన విడుదల చేయడం గమనార్హం. పార్టీకి కష్టకాలంలోనూ, ఉచ్ఛదశలోనూ విశేష సేవలందించారని కొనియాడింది. టీడీపీ అధినేత చంద్రబాబు సైతం ఇది వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ అంతర్గత వ్యవహారమంటూనే.. నాయకుడిపై నమ్మకం లేకపోవడం వల్లే ఇలాంటివి చోటు చేసుకుంటున్నాయంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. లోకేష్ సహా ఇతర సీనియర్ నాయకులు మాత్రం రాజకీయ సన్యాసం తీసుకున్నా.. చేసిన తప్పులకు మాత్రం శిక్ష అనుభవించే తీరాల్సి ఉంటుందని హెచ్చరించారు. మరికొందరు నాయకులు అల్లుడి వ్యాపారాలకు నష్టం కలగకుండా ఉండేందుకు విజయసాయిరెడ్డి జాగ్రత్తపడ్డారని.. అందుకే రాజీనామాతో రాజీ చేసుకున్నారని ఆరోపిస్తున్నారు. ఇక వెనుకనుంచి విజయసాయిరెడ్డిని నడిపిస్తోందనే ప్రచారం నేపథ్యంలో బీజేపీ నాయకులు ఈ విషయంపై ఆచితూచి స్పందిస్తున్నారు. విజయసాయిరెడ్డి బీజేపీలో చేరుతారనే ఊహాజనిత, సోషల్ మీడియా ప్రచారంపై తాము స్పందించబోమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి తేల్చిచెప్పారు. ఇక పవన్ తనకు చిరకాల మిత్రుడన్న విజయసాయిరెడ్డి రాజీనామాపై జనసేన నేతలు ఏమాత్రం స్పందించడం లేదు.

## ఎవరికి లాభం.. ఎవరికి నష్టం..

విజయసాయిరెడ్డి రాజీనామా వ్యవహారం ఎంత కాదన్నా.. వైఎస్సార్‌సీపీకి బలమైన ఎదురుదెబ్బే అనడంలో ఏమాత్రం సందేహం లేదు. పైకి కనిపించకున్నా లోలోన ఆ పార్టీ నాయకులు మదనపడుతున్నట్లు తెలిసింది. మాయలపకీరు ప్రాణం సప్త సముద్రాల అవతలున్న చిలుకలో ఉన్నట్లు.. జగన్ వ్యవహారాలన్నింటిపై పూర్తిస్థాయి అవగాహన ఉన్న విజయసాయిరెడ్డి ఏ సమయంలో ఏ బాంబు పేల్చుతారో అన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల సహా వైఎస్ కుటుంబంతో నాలుగు దశాబ్దాలుగా, మూడు తరాలుగా సంబంధాలున్న విజయసాయిరెడ్డే ఆయన్ని వదిలి వెళ్తున్నప్పుడు తామెందుకు ఆందోళనల పేరుతో కూటమి ప్రభుత్వానికి ఎదురెళ్లి చొక్కాలు చించుకోవాలని సగటు వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్త భావించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక విజయసాయిరెడ్డి ఖాళీ చేసిన సీటు కూటమి పార్టీలకు దక్కడం ఖాయం కావడంతో ఎవరికి వారు లాబీయింగ్ ప్రారంభించినట్లు సమాచారం. ఇదే సమయంలో ఏపీ నుంచి మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి లేదా సీనియర్ హీరో చిరంజీవి రాజ్యసభకు బీజేపీ తరపున వెళ్లేందుకు రంగం సిద్ధమవుతోందనే ప్రచారం జోరందుకుంది. ఇక సరిగ్గా ఇలాంటి సమయంలో వైఎస్ జగన్ ప్లాన్ ప్రకారమే.. విజయ్‌సాయిరెడ్డిని పార్టీ నుంచి బయటకు పంపించి బీజేపీకి దగ్గర చేస్తున్నారని, స్వకార్యంతో పాటు స్వామి కార్యం కోసమే విజయసాయిరెడ్డి రాజకీయ సన్యాసం పేరుతో నాటకాలు ప్రారంభించారని కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు, వైఎస్ జగన్ చెల్లెలు వైఎస్ షర్మిలా బాంబు పేల్చడం గమనార్హం. ఏదేమైనా రైతు కుటుంబం నుంచి వచ్చిన విజయసాయిరెడ్డి తన అవసాన దశను రైతుగానే ముగిస్తానన్న ప్రకటనలో ఎంత నిజముందో విజయసాయి పదే పదే తల్చుకుని ప్రమాణం చేసిన ఆ వెంకటేశ్వరస్వామికే ఎరుక....!

# 'పండుటాకులు' బృందానికి సత్కారాలు





నెల్లూరులోని కళాంజలి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ నటుడు- దర్శకుడు- రచయిత కళాంజలి అనంత్ దర్శకత్వంలో రూపొందిన 'పండుటాకులు' షార్ట్‌ఫిల్మ్‌లోని నటీనటులు, సాంకేతిక బృందానికి నెల్లూరులో ఘనసన్మానాలు జరిగాయి. ఇటీవల హైదరాబాద్‌లోని డా. భానుమతి రామకృష్ణ మెమోరియల్‌ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్ పోటీలో 'పండుటాకులు'కు రెండు బహుమతులు రావడం తెలిసిందే! ఉత్తమ మాటల రచయితగా డా.కె.రామచంద్రమూర్తి, క్యారెక్టర్ ఆర్టిస్టుగా మునిచంద్రకు ఆ అవార్డులు వచ్చాయి. అదేవిధంగా గతంలో కూడా 'పండుటాకులు'కు ఉత్తమ దర్శకునిగా కళాంజలి అనంత్, ఉత్తమ నటుడుగా ధనుంజయలు అవార్డులు సాధించి, నెల్లూరు కళారంగానికి ఖ్యాతిని తెచ్చారు. ఈ నేపథ్యంలో ఈనెల 26న అవార్డు గ్రహీతలను నెల్లూరు ట్రంకురోడ్డులోని టీవీఎస్ కల్యాణసదన్‌లో నిర్వాహకులు అభినందించి సన్మానించారు.


ఈ కార్యక్రమంలో కళాంజలి సంస్థ గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, అవోపా అధ్యక్షులు చంద్రశేఖర్‌గుప్తా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెంచలరావు పాల్గొన్నారు. అవార్డు గ్రహీతలతో పాటు 'పండుటాకులు'లో నటించిన కళాకారులు దువ్వూరు బెనర్జీ, అనూష, ప్రసన్నాంజనేయులు, పార్వతీశం, టెక్నీషియన్లు సంగీత్ సౌరభ్, అశోక్, ప్రముఖ గాయకుడు కృపానందంలను సన్మానించారు. అదేవిధంగా ప్రముఖ గాయని జ్ఞానశ్రీని కూడా నిర్వాహకులు సత్కరించారు.

# డీఆర్‌యుసీసీ సభ్యుడిగా..సలీమ్

దక్షిణమధ్య రైల్వే డీఆర్‌యుసీసీ సభ్యుడిగా జిల్లా నూర్‌బాషా సంక్షేమ సంఘం అధ్యక్షులు షేక్ సలీమ్ నియమితులయ్యారు. ఆమేరకు డీఆర్‌యుసీసీ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ నుంచి ఆయనకు ఉత్తర్వులందాయి. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్)కు ఆయన సన్నిహితులు. ఈ సందర్భంగా సలీమ్, తన నియామకానికి సహకరించిన బీఎంఆర్‌ను ఈనెల 28న కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. రైల్వే డీఆర్‌యుసీసీ సభ్యునిగా రైల్వే ప్రయాణీకుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానని ఆయన తెలిపారు.



# మహిళల స్వశక్తితో.. కుటుంబ వృద్ధి



మహిళల స్వశక్తితోనే కుటుంబం వృద్ధి చెందుతుందని, పేద మహిళల అభ్యున్నతికి సహకరించడం అభినందనీయమని గూడూరు డీఎస్పీ గీతాకుమారి అన్నారు.పట్టణంలోని సునీతా సేవాసంస్థ కార్యాలయంలో మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్ శిక్షణని ఆమె ఇటీవల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధానకార్యదర్శి సారంగం శ్రీనివాసులు, సులక్ష్మి, భాస్కర్‌రావు, జ్యోతి పాల్గొన్నారు.




## బాలికలకు..
# బంగారు భవితను అందించాలి

బాలికలకు బంగారు భవితనందించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుజాత కోరారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నెల్లూరు కస్తూరిదేవి హైస్కూల్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆమె మాట్లాడుతూ, బాలికలు అన్నిరంగాల్లో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. మహిళా పోలీసుస్టేషన్ డిఎస్పి రామారావు మాట్లాడుతూ బాలికలకు మనం ఇచ్చే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే వారికిచ్చే నిజమైన గౌరవమన్నారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అవగాహన పెంచడమే జాతీయ బాలికా దినోత్సం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బాలికలకు రక్షణగా ఉన్న చట్టాలపట్ల వారికి అవగాహన కల్పించాలన్నారు. ఐసిడిఎస్ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ అనూరాధ, జిల్లా కార్మికశాఖ అధికారి వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపిసి వెంకటసుబ్బయ్య, ఎంఇవో జానకిరాం, బాలల సంరక్షణ అధికారి సురేష్, సమత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యులు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విఎస్‌యులో... బాలికా దినోత్సవం



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు) మహిళా విభాగం, మరియు ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయంతో, పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా-నెల్లూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల విఎస్‌యులో 17వ జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. విజయభాస్కరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, శ్రేయస్సు పెంపొందించడంలో అందరూ సహకరించి, సమాజంలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. డాక్టర్ పసుపులేటి వసుమతి విశిష్ట అతిథిగా పాల్గొని, పిసిఓడీపై- పోషకాహార లోపం, సర్వైకల్ క్యాన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎం.హనుమారెడ్డి అధ్యక్షత వహించగా, డాక్టర్ ఆర్.మధుమతి కార్యనిర్వాహకురాలిగా వ్యవహరించారు. డాక్టర్ కె.సునీత, డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ ఎస్.వేణుగోపాల్ పాల్గొని, బాలికల ఆరోగ్యం, విద్య గురించి వివరించారు. డాక్టర్ జి.సాయిస్రవంతి వందన సమర్పణ చేశారు.

## ఉపాధ్యాయులకు..
# ఉత్తమ సేవా పురస్కారాలు



నెల్లూరులోని కె.ఎన్.ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి అసోసియేట్ ఆఫీసర్, తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న గుండాల నరేంద్రబాబు, మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయునిగా, ఎన్‌సిసి నేవల్ ఆఫీసర్‌గా ఉన్న సి.వి.నాగరాజు జనవరి 26న 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారాలందుకున్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో, వారి విశిష్ట సేవలకు గుర్తింపుగా కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, మేయర్ పొట్లూరి స్రవంతి వారికి ఆ అవార్డులను బహుకరించారు.

## ఓటర్ల దినోత్సవం సందర్భంగా..
# జిల్లా అధికారులకు అవార్డులు




నెల్లూరు జిల్లాలో 2024వ సంవత్సర సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ సేవలందించినందుకు జిల్లాకు చెందిన పలువురు అధికారులు అవార్డులు అందుకున్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25న విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ వి.కె.శీనానాయక్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కావలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన శీనానాయక్ ఓటింగ్ శాతం పెంచేందుకు విశేషంగా కృషిచేసినందుకు, సమర్థవంతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించినందుకు రూ.15వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నారు. అదేవిధంగా, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ ఓఎస్డీగా పనిచేస్తున్న గోళ్ల వెంకటేశ్వర్లు 2024 సార్వత్రిక ఎన్నికల్లో కృష్ణాజిల్లా జగ్గయ్యపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉత్తమ సేవలందించినందుకు చీఫ్‌సెక్రటరీ చేతులమీదుగా రూ.15వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నారు. మనుబోలు తహాశీల్దారుగా పనిచేస్తున్న సుబ్బయ్య బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన సమయంలో ఉత్తమ సేవలందించినందుకు అవార్డు అందుకున్నారు. గతంలో నెల్లూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్‌గా పనిచేసిన పి.దేవికుమారి నెల్లూరు సిటీ నియోజకవర్గ ఏఈఆర్‌ఓగా ఉత్తమ సేవలు అందించినందుకు అవార్డు అందుకున్నారు. ఉదయగిరి బిఎల్‌ఓ వై.హజరత్, కావలి బిఎల్‌ఓ కె.నాగార్జున నెల్లూరు జిల్లా నుంచి అవార్డులు అందుకోవడం విశేషం. జిల్లాకు చెందిన అధికారులు రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకోవడం పట్ల జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో.. డా.బీవీరావు వర్ధంతి



కోళ్ల పరిశ్రమ పితామహుడు, కోళ్ళ రైతులకు ఆరాధ్యుడు పద్మశ్రీ డాక్టర్ బీవీరావు 29వ వర్ధంతి కార్యక్రమం నెల్లూరులోని ఏసీ స్టేడియంలో ఈనెల 26న ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉడికించిన కోడిగ్డులను ఉచితంగా వాకర్స్‌కు, క్రీడాకారులకు అందజేశారు. కోళ్ల పరిశ్రమకు బీవీరావు అందించిన సేవల గురించి, ఆయన జీవిత విశేషాల గురించి 'నెక్' మాజీ జోనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు వివరించారు. అనంతరం, గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి జి.నారాయణరెడ్డి, బెజవాడ సునీల్‌రెడ్డి, హైటెక్ రమణారెడ్డి, డాక్టర్ కె.బాలస్వామి తదితరులు ఈ కార్యక్రమాలకు సహకారం అందించారు. అసోసియేషన్ అధ్యక్షులు కిలారి శ్రీనివాసులునాయుడు, కోశాధికారి మాగంటి ప్రసాద్, బిరదవోలు రామమోహన రెడ్డి, ఎస్‌కే నజీర్‌అహ్మద్, ఎస్.సుబ్బరాయుడు, బెల్లం చెంచయ్య, కె.శివయ్య, డి.జయరామనాయుడు, వి.వెంకటేశ్వర్లు, ఐ.సోను, నైజాం వెంకటేశ్వర్లు, ఎం.పిచ్చయ్య, మన్నేపల్లి సురేష్, వద్దినేని వెంకటేశ్వర్లుతోపాటు సభ్యులు పాల్గొన్నారు.

# నెహ్రూ యువ కేంద్రం.. రోడ్డు భద్రతా వారోత్సవాలు



నెల్లూరులోని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 17వతేదీ నుంచి 23వ తేది వరకు వివిధ కూడళ్ళలో రోడ్డు భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు సౌత్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వెంకటరెడ్డి, నార్త్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ చేతులమీదుగా సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి మాట్లాడుతూ, ఈ వారోత్సవాల్లో భాగంగా పోలీసు సిబ్బందితో కలిసి స్వచ్ఛంధ సేవలందించిన వారందరినీ అభినందించారు. అతివేగం ప్రమాదకరమని, ద్విచక్రవాహనదారులు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను అందరూ పాటించాలని చెప్పారు. ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరమని వివరించారు.

## టూకీగా...



### గంగపట్నంలో.. 'పొలం పిలుస్తోంది'

ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో ఈనెల 28న వ్యవసాయ సంచాలకులు ఏ.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి రైతులకు ఆన్‌లైన్ ద్వారా పంటనమోదుపై అవగాహన కలిగించారు. ఎంఏఓ రఘునాథరెడ్డి, విఏఏలు సుదీక్షణ, నరహరి పాల్గొన్నారు.

### తుమ్మగుంటలో పశువైద్య శిబిరం

విడవలూరు మండలం తుమ్మగుంట గ్రామంలో ఈనెల 28న వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ వాణీశంకర్ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. పశువులకు వైద్యపరీక్షలు చేసి సాధారణంగా వచ్చే వ్యాధుల నివారణకు మందులిచ్చారు. పశువుల వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కలిగించారు.

### ఆత్మకూరులో అన్న క్యాంటీన్ తనిఖీ

ఆత్మకూరు అన్న క్యాంటీన్‌లో ఆహారపదార్థాల నాణ్యత పరిశీలనకు మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్ ఈనెల 27న ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ భోజనం చేస్తున్న వారితో నేరుగా మాట్లాడి, నాణ్యతపై ఆరా తీశారు. క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, క్యాంటీన్‌కు వచ్చేవారికి ఎలాంటి లోపాలు లేకుండా మంచిభోజనం పెట్టాలని సిబ్బందికి స్పష్టం చేశారు.

### విడవలూరు ఎంపీడీఓకు సన్మానం

వృత్తిరీత్యా ప్రజలకు విశిష్టసేవలందించిన విడవలూరు ఎంపీడీఓ నగేష్‌కుమారికి గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ ఆమెకు ఉత్తమ అధికారిణిగా ప్రశంసాపత్రాన్ని బహుకరించిన నేపథ్యంలో, ఈనెల 28న ఆమెను విడవలూరులో వైస్‌ఎంపీపీ శ్రీనివాసులు తదితరులు ఘనంగా సన్మానించారు. అలగానిపాడు ఎంపీటీసీ పాల్గొని ఆమెను అభినందించారు.

### కందుకూరు జాబ్‌మేళాలో 33 మందికి ఉద్యోగాలు

కందుకూరు పట్టణంలో ఈనెల28న నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 33 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, స్థానిక టిఆర్‌ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈ ఎంపికలు జరిగాయి. జాబ్‌మేళాకు వచ్చిన నిరుద్యోగ యువతకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భోజనసదుపాయం కల్పించారు.

### కలువాయిలో గ్రామాల భద్రతపై చర్చ

కలువాయి మండలంలోని సర్పంచ్‌లతో ఎస్‌ఐ సుమన్ ఈనెల 28న సమావేశమై, గ్రామాల్లో భద్రత కోసం కూడళ్ల ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘాను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు సంబంధించి పలు అంశాలను చర్చించారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు పాల్గొని గ్రామాల్లోని సమస్యలను ఎస్‌ఐ దృష్టికి తీసుకువచ్చారు.

### సోమశిల డ్యామ్‌లో పుష్కలంగా నీళ్ళు

జిల్లాలోని సోమశిల జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి వరదనీటి ప్రవాహం వస్తుండడంతో డ్యామ్‌లో పుష్కలంగా నీళ్ళు చేరాయి. ఈ జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఈనెల 28 నాటికి డ్యామ్‌లో 67.702 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువప్రాంతాల నుంచి ఈనెల 28న 1838 క్యూసెక్కుల నీటిప్రవాహం వచ్చింది.

### సంగంలో రోడ్డుభద్రతపై అవగాహన

రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఈనెల 27న మండల కేంద్రమైన సంగంలో ఎస్‌ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ నుండి జాతీయరహదారి వరకు ర్యాలీ చేపట్టారు. వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కలిగించారు. మహిళలు వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉంటూ, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### కొత్తపల్లి హైస్కూల్‌కు ప్రింటర్ బహుకరణ

కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామంలో దాత పొన్నగంటి రవీంద్రనాథ్ 20వేల రూపాయలు విలువచేసే ప్రింటర్‌ను విద్యార్థుల అవసరాల కోసం బహుకరించారు. ఈనెల 27న తెలుగుయువత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మెన్ వేణు, వైస్‌ఛైర్‌పర్సన్ మన్నేపల్లి స్రవంతి, మార్కండేయులు, పొన్నగంటి రాజా, మహేష్ పాల్గొన్నారు.

# వికసించని విద్య



## గుణ'పాఠం' ఎప్పుడు..?

**చదువు.. బ్రతుకుకి దారి చూపే దీపం. పెద్దలపట్ల గౌరవభావాన్ని, తనకన్నా చిన్నవారి పట్ల ప్రేమను పెంపొందించే నేస్తం. అన్నింటికీమించి సమాజంలో ఒకరి భావాలను ఒకరు అర్థం చేసుకునేందుకు, కలిసిమెలసి జీవించేందుకు మార్గం చూపే దిక్సూచి. భవిష్యత్‌ను ఉన్నతంగా, ఆదర్శంగా తీర్చిదిద్దుకునేందుకు వెలుగునిచ్చే దివిటీ.**

కానీ ప్రస్తుతం చదువంటే మార్కులు, చదువంటే ర్యాంకులు, అన్నింటికీమించి తల్లిదండ్రులకు చదువంటే ఖర్చు, మోయలేని భారం. ఇక విద్యార్థులకు చదువంటే పుస్తకాల మోత, బట్టీపట్టి రాసే రాత. ఎవరు కాదన్నా అవునన్నా ఇది నిజం. ఎందుకంటే ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలు తల్లిదండ్రులను ప్రసన్నం చేసుకునేందుకు ఎల్‌కేజీ విద్యార్థికి గణితంలో మెలుకువలు, ఎనిమిదో తరగతి విద్యార్థికి ఐఐటీ పాఠాలంటూ పచ్చి అబద్ధాలతో ఊదరగొట్టేస్తున్నాయి. పైగా నేషనల్, ఇంటర్నేషనల్, టెక్నో, బ్రిలియంట్ అంటూ అరచేతిలో స్వర్గం చూపిస్తూ, దోపిడీకి పాల్పడుతున్నాయి.

ఇదే సమయంలో పేద, మధ్యతరగతి బిడ్డలకు బతుకు దారి చూపిస్తాయని ఆశిస్తున్న పభుత్వ పాఠశాలలు అలివిమాలిన నిర్లక్ష్యం, అడ్డగోలు నిర్వహణతో పూర్తిగా గాడితప్పుతున్నాయి. కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాల అంటే కాలక్షేపం అని, రియల్ ఎస్టేట్ చేసుకునేందుకు, తమ వ్యాపారాల గురించి చర్చించుకునేందుకు, వడ్డీలెక్కలు వేసుకునేందుకు, కూర్చొని పిచ్చాపాటీ మాట్లాడుకునేందుకు ఏర్పాటు చేసిన రచ్చబండలా భావిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతిభ రోజురోజుకూ తీసికట్టుగా మారుతుండడమే ఇందుకు కారణం. ఈ విషయం తాజాగా దేశంలో విద్యాప్రమాణాలు, ప్రభుత్వ పాఠశాలల పనితీరు, వాటి అభివృద్ధిపై ఏటా నివేదిక ఇచ్చే యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్(అసర్)లో స్పష్టమైంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో విద్యాప్రమాణాలు దిగజారిపోయాయని, విద్యార్థులు ప్రపంచంతో పోటీపడడం అటుంచితే కనీసం వారి కిందితరగతులకు సంబంధించిన పుస్తకాన్ని కూడా చదవలేకపోతున్నారంటూ ఆగ్రహంతో కూడిన ఆవేదనను వ్యక్తం చేసింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడమంటే.. పిల్లల జీవితాన్ని బలిచేసుకోవడమే అనే వ్యాఖ్యానాలు చాలమంది తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి.

### నివేదికలో వెల్లడించిన కఠోర సత్యాలు ఓసారి పరిశీలిస్తే...

2022-24 మధ్య ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాల్లో విద్యాప్రమాణాలు దిగజారాయని అసర్ నివేదిక తేల్చిచెప్పింది. గ్రామీణ ప్రాంతాల ప్రాథమిక స్థాయి విద్యార్థులకు కనీసం కూడికలు, తీసివేతలు కూడా రాలేదని తేల్చింది. అలాగే ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య 2018 నాటికి 63.2 శాతం ఉంటే..2024కి 61.8 శాతానికి పడిపోయిందని పేర్కొంది. ఇక 8వ తరగతి పిల్లలు కింది తరగతుల పుస్తకాలను కనీసం చదవలేకపోతున్నారని నివేదిక పేర్కొంది. సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రాల్లో విద్యార్థుల ప్రగతి దిగజారిందని, చాలా ప్రాంతాల్లో కనీసం నోటిలెక్కలను కూడా పిల్లలు చేయలేకపోతున్నారని ఆక్షేపించింది. ఇక కనీసం బాల్య, కౌమార, యుక్త వయస్సులో శరీరంలో వచ్చే సహజ మార్పులు, వాటి ఫలితాలు, ప్రభావాలపై కూడా కనీస అవగాహన కలిగి ఉండడం లేదంటూ తేల్చింది. సకాలంలో పాఠాలు పూర్తి చేయడంతో పాటు పాఠ్యాంశాన్ని బోధించేటప్పుడు ఉపాధ్యాయులు తమ జీవితానుభావాలను తెలియజేయాలని, వాటిని తమకు ఎలా అన్వయించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించింది. పాఠ్యప్రణాళిక కూడా విద్యార్థులకు భారం కాకుండా వారిని భావిభారత పౌరుడిగా తీర్చిదిద్దే దిక్సూచీ కావాలంది. అదే సమయంలో ఉపాధ్యాయులు కూడా బోధనా పద్ధతుల్లో ఆధునీకత, సరళత పాటించాలని, భవిష్యత్ ప్రయోజనాలను గుర్తించుకుని సృజనాత్మకంగా పాఠ్య విషయాన్ని తెలియజేయాలని సలహా ఇచ్చింది. అన్నింటి కంటే ముఖ్యంగా కనీస విద్యాప్రమాణాలు (ఏ తరగతికి తగినట్లు విద్యార్థుల్లో ఆ తరగతి నైపుణ్యాలను పెంపొందించడం) మెరుగుపరచడంలో ఉపాధ్యాయులు, పాలకులు చొరవ తీసుకోవాలని స్పష్టం చేసింది.

### మార్పు రావాలంటే ఇవి పాటించాల్సిందే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియం చదువుల పేరుతో హడావుడి చేస్తే, ప్రస్తుతం ప్రభుత్వం కొత్త మార్గదర్శకాల రూపకల్పన పేరుతో ఇంకా మీనమేషాలు లెక్కిస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇక ఉపాధ్యాయ సంఘాలు కూడా పీఆర్సీ, సెలవులు, కరువు భత్యం బకాయిలపైనే కాకుండా విద్యాబద్ధులు నేర్పే క్రమంలో పిల్లలంతా తమ బిడ్డలే అనే తరహాలో విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం కనిపిస్తోంది. ముఖ్యంగా మాతృభాష, ఆంగ్లం, గణితం, సామాన్యశాస్త్రంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు కనీసం ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్థులకు ఉండాల్సిన నైపుణ్యాలను కూడా అందుకోవడం లేదన్నది కఠోర వాస్తవం. అందుకే ఉపాధ్యాయులు పాఠశాల సమయంలో ఇతర వ్యాపకాలపై కాకుండా కేవలం బోధనపైనే దృష్టి సారించేలా పాలకులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

అదే సమయంలో తరగతి గదులు, స్టాఫ్‌రూంలలో సెల్‌ఫోన్లను తీసుకెళ్లకుండా చూడాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో కనీసం నెలలో ఒకసారైనా ఉపాధ్యాయుడు సమావేశమై విద్యార్థి ప్రతిభా పాటవాలు, అవగాహన లోపాలను తెలియజేసేలా ప్రణాళిక రూపొందించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. విద్యార్థులను నిత్యం ప్రోత్సహిస్తూ వారి స్కిల్‌డెవలప్‌మెంట్‌తో పాటూ ఉత్తీర్ణత శాతాన్ని పెంచే ఉపాధ్యాయులకు ప్రోత్సాహకాలను అందించే కార్యక్రమాలను వేగవంతం చేయాలని పేర్కొంటున్నారు. అలాగే తక్కువ ప్రతిభ చూపుతూ, విధి నిర్వహణలో అంకిత భావం లేకుండా పనిచేస్తున్న వారి ఇంక్రిమెంట్లలో కోత విధించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేస్తున్నారు. అప్పుడే ఉపాధ్యాయుల తీరులో మార్పు వస్తుందని, అదే సమయంలో ప్రభుత్వాలు కూడా టీచర్లను కేవలం బోధన కోసమే వినియోగించాలని ఇతర కార్యక్రమాల పేరుతో వారిని విద్యార్థులకు, పాఠశాలకు దూరం చేయకుండా జాగ్రత్త పడాలని అంటున్నారు. అప్పుడే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రపంచంతో పోటీపడి, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోగలరని, ఇందుకు అనుగుణంగా పాఠశాల కరికులంలో తక్షణం మార్పులు చేయాల్సిన అవసరాన్ని నొక్కి వక్కాణిస్తున్నారు. ఇవి క్షేత్రస్థాయిలో సాకారమై ప్రభుత్వ పాఠశాల్లో నిజమైన మార్పులొస్తే విద్యార్థుల భావి జీవితానికి ముందడుగు పడినట్లే..!

# గగనతలంలోకి ఘనంగా.. శతాస్త్రం

(మొదటిపేజీ తరువాయి)



ఇప్పుడు రోదసిలోకి పంపిన 2250 కిలోల బరువున్న నావిక్-02 ఉపగ్రహం అధునాతనమైన కొత్తతరం నావిగేషన్ ఉపగ్రహాల్లో ఒకటి. భౌగోళిక, వైమానిక, సముద్ర నావిగేషన్ సేవలు, వ్యవసాయంలో సాంకేతికత, మొబైల్ లొకేషన్ ఆధారిత సేవలకు ఈ ఉప గ్రహం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇది పూర్తిగా ఇస్రో శాస్త్రవేత్తల స్వయంకృషితో రూపుదిద్దుకోవడం విశేషం. భారత్ భూభాగంలోనే కాక, వెలుపల మరో 1500 కిలోమీటర్ల దాకా నావిగేషన్ సేవలందించేలా శాస్త్రవేత్తలు ఈ ఉపగ్రహాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దారు. భారత విమానయాన, నౌకాయాన మార్గాలకు, రక్షణ అవసరాలకు ఈ నావిగేషన్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుంది.

### వచ్చే అయిదేళ్లలో.. మరో వంద ప్రయోగాలు :

అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రో 100వ మైలురాయి చేరుకోవడం ఒక అద్భుతం. జనంలో కూడా మనం సెంచరీ కొట్టేసినంత ఆనందం. అందులో ఈ వందలో 90 ప్రయోగాలు విజయం సాధించడం మరో విశేషం. 1979లో షార్ నుంచి తొలి రాకెట్ ప్రయోగం జరిగాక, ఈ 46 ఏళ్ళలో ఎందరో అంత రిక్ష శాస్త్రవేత్తల అకుంఠిత కృషితో ఇస్రో ఇలా ఒక్కటొక్కటిగా ఎన్నో ఘనమైన విజయాలు సాధిస్తూ, భారత్ కీర్తిని ప్రపంచవ్యాప్తం చేస్తోంది. షార్ నుంచి రాకెట్ బయలుదేరిందంటే అది తప్పకుండా విజయవంతమవుతుందనే నమ్మకం సాధారణ ప్రజలకు కూడా వచ్చేసింది. రామబాణం లాంటి రాకెట్‌లు ఇస్రో అమ్ములపొదిలోకి చేరడంతో ఇక రాకెట్ ప్రయోగాలు మునుపటికంటే మరింత వేగం పుంజుకోనున్నాయి. గతంలో ఉన్న పరిజ్ఞానం మేరకు 100 ప్రయోగాలు చేయడానికి ఇంత కాలం... అంటే, దాదాపు 46 ఏళ్లు పట్టింది. ఇప్పుడు అధునాతన సాంకేతిక విజ్ఞానంతో అదే 100 ప్రయోగాలను కేవలం అయిదేళ్ళలోనే చేయగలమన్న భరోసా శాస్త్రవేత్తల్లో కనిపిస్తోందంటే, ఒక్క రాకెట్లే కాదు.. మానవమేధస్సు కూడా రాకెట్‌ల కంటే వేగంగా పయనిస్తోందని అనుకోవచ్చు. ఈ ప్రయోగ విజయానంతరం 'రానున్న అయిదేళ్ళలోనే మరో వంద రాకెట్ ప్రయోగాలు చేస్తాం' అని ఇస్రో ఛైర్మెన్ ధీమాగా చెప్పారంటే అది మన శాస్త్రవేత్తల విశ్వాసానికి.. ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా భావించవచ్చు.

### ఇంతై.. అంతై.. ఆకాశమంతై!..

సైకిల్‌పైనా, ఎడ్లబండ్ల మీదా రాకెట్ విడిభాగాలను అత్యంత ప్రయాసలతో మోసుకువెళ్ళి రాకెట్ ప్రయోగాలు ప్రారంభించిన కాలం నుంచి, ఇస్రో ఇంతై అంతై ఆకాశమంతైంది. దాదాపు ఈ 46 ఏళ్ళలో కాలూచెయ్యీ కూడదీసుకుని.. ఎన్నో అవస్థలను అధిగమించి, గగనతలంలో మెరుపులు మెరిపిస్తూ 100 ప్రయోగాలు చేయడమంటే సామాన్యమైన విషయమేమీ కాదు. వాతావరణ పరిశోధనలకు, ఇంటర్నెట్ వ్యవస్థలకు, రానున్న ఉత్పాతాలను ముందుగానే కనిపెట్టి ఖచ్చితమైన సమాచారం ఇచ్చేందుకు, ప్రజోపయోగం కోసం ఇప్పటికే ఎన్నో ఉపగ్రహాలను ఇస్రో అంతరిక్షంలోకి పంపి ఉంది.

అంతేకాదు, చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టి ప్రపంచాన్నే విస్మయానికి గురిచేసిన ఇస్రో..ఆ తర్వాత అంతరిక్షంలోనే రెండు ఉపగ్రహాలను చేరువచేస్తూ డాకింగ్ చేసే స్థాయికి కూడా ఎదగడం గొప్ప విషయం. చంద్రుడిపైకి మానవులను (వ్యోమగాములు) పంపడానికి చంద్రయాన్ మిషన్‌ను కూడా మరింత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇస్రో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోంది. చల్లని చంద్రుడితో పాటు..భగభగ మండే సూర్యుడు, ఇతర గ్రహాల రహస్యాలను తెలుసుకునేందుకు ఇస్రో నిరంతరం కృషిచేస్తూనే ఉంది. అందులో భాగంగా ఇటీవలే ఆదిత్య-ఎల్1 మిషన్‌ను కూడా చేపట్టింది. ఒక్కమాటలో చెప్పాలంటే, ఈ అధునాతన రాకెట్ యుగంలో ఇస్రోదే ఓ కొత్త శకం అనుకోవచ్చు.

**జయహో ఇస్రో!.. జయ జయహో ఇస్రో!..**

### శ్రీసిటీ-ఐసాన్ పరిశ్రమ వితరణతో..

# సత్యవేడు హైస్కూల్‌కి కొత్త హంగులు



శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో (సీఎస్ఆర్) భాగంగా శ్రీసిటీలోని జపాన్ పరిశ్రమ ఐసాన్ ఆటో పార్ట్స్ ఇండియా వారు సత్యవేడు ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన వివిధ విద్యా వసతులను ఆ కంపెనీ డైరెక్టర్ యసనోరి సకావే, శ్రీసిటీ డైరక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి ఈనెల 29న ప్రారంభించారు. సమావేశ మందిర నిర్మాణం, మరుగుదొడ్లు, సిక్‌రూమ్, వంటగదుల మరమ్మతులు, అదనపు పైకప్పు నిర్మాణం, క్రీడా మైదానం అభివృద్ధితో పాటు పాఠశాల ఆవరణ చుట్టూ మొక్కలు నాటి, ఆ మొక్కలు పెంచేందుకు నీటి పైప్ లైన్, కుళాయిలు కూడా ఏర్పాటుచేశారు. నిరీషా సన్నారెడ్డి, ఐసాన్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ యూచి టొమిట, కోఆర్డినేటర్ తోషిహిరో సనా, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ గోపాల్, డేప్యూటీ మేనేజర్ గ్లోరీ, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com